## మీ చరణాల చెంత ఇంత చోటుకై...



మీ పాదాల చెంత నాకింత చోటు ఉంది అంటే, అది మీ 'ప్రేమ'.
అది మీ 'అనుగ్రహమే'. అది మీ కృపే.  అది మీ దయ, కరుణలేగానీ,
నాదేమీ లేదు స్వామీ!
ఆ చోటున స్థిరమై నిలవాలంటే, అచలమై ఉండాలంటే మీ బోధ మాలో నిలవాలి.
మీరు నడిచి చూపిన బాటన నడవాలన్న అవగాహన...
'మీ చెంత అసాధ్యానికి తావులేదు అన్న నిత్యసత్యం,
కనులముందు కదలాడుతున్నది మీ కదలికలలో,
మీ స్పందనలలో, ప్రతిస్పందనలలో...
ఈ దర్శనం, ఈ నిత్యసత్యం మాలో విశ్వాసాన్ని కలిగించాలి,
ప్రేరణ కలగాలి, స్ఫూర్తి రగలాలి.
అలా మమ్ము నియమించమన్నదే మా ప్రార్థన స్వామీ!

గురుకృప

శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



# గురుకృప

**ఆదర్శపు వెలుగులలో - ఆచరణల దీపారాధన**


ఆరాధనోత్సవ సంచిక



## శిరిడీ ఎందుకు వెళ్ళాలి?

మన అహంకారాన్ని పెంచేటువంటి విషయాలలో ఎదుటివాడిని మోసం చేసేటువంటి విషయాలలో మాత్రం అబద్ధం చెప్పకుండా జాగ్రత్త పడాలి. ఆ జాగ్రత్త పడేటువంటి నేచర్ మనకు రావడానికి మనం శిరిడీ వచ్చేది. ఎవరో అడిగారు "ఎందుకండీ ఊరకనే అంతంత చార్జీలు పెట్టుకొని శిరిడీకి పోవడం? ఆ ఐదువందల రూపాయలతో, వెయ్యి రూపాయలతో పేదవాళ్ళకి, అన్నం లేనివాళ్ళకి, అన్నం పెట్టవచ్చు కదా? బాబా అంతటా ఉన్నారు. సర్వత్రా ఉన్నారు కదా, శిరిడీకే పోవాలా? అనడిగారు. బాబా అంతటా, అందరిలోనూ ఉన్నారు. 'ఆకలిగొన్నజీవికి అన్నం పెడితే బాగుంటుంది... అనే విషయాన్ని నేర్చుకోవడానికే నేను శిరిడీకి పోయేది' అని నేను చెప్పాను. అట్లా పోకుండా పోనీ ఎవడన్నా పెడుతున్నాడా? ఈ మాట చెప్పినవాడు పెడతాడా? ఎప్పుడన్నా పెట్టాడా? చూడండి... నువ్వు శిరిడీకి పోవాలా ఏమిటి? బాబా ఇక్కడ లేరా? అని ప్రశ్నలు అడుగుతుంటారు. ఆకలిగొన్న జీవికి అలా అన్నవాడు ఎప్పుడన్నా ఒక వందరూపాయలు కాదు, యాభై రూపాయలైనా పెట్టి సహాయం చేసాడేమోనని అడగండి. లేదూ, మనం శిరిడీకి పోకుండా వెయ్యి రూపాయలు మిగుల్చు కున్నామనుకోండి... ఎంత సద్వినియోగం చేస్తున్నారో ఒక్కసారి ఆలోచించి, చూడండి. శిరిడీకి రావడం ఎందుకనంటే దాన్ని నేర్చుకోవడానికి. మనకిప్పుడు రకరకాల బలహీనతలున్నాయి, రకరకాల వ్యామోహాలున్నాయి... అబద్ధాలు చెప్తున్నాము ఇంకా ఎన్నో రకాల వ్యామోహాలున్నాయి. వాటిని చూసి మనం సిగ్గుపడుతున్నాం. ఇవి పోగొట్టుకోవాలి. ప్రతి మనిషి వాడి యొక్క బలహీనతలు పోగొట్టుకోవడం కోసం తపనపడుతూనే ఉంటాడు. కొంతమంది కొంతవరకు సఫలీకృతులవుతారు, కొంతమంది సఫలీకృతులు కారు. సఫలీకృతుడు కాలేనటువంటి వాడు దాన్ని పోగొట్టుకునేటువంటి బలం సంపాదించడానికోసం ప్రయత్నం చేస్తాడు. ఆ ప్రయత్నమే ఇది. మహాత్ములైనటువంటి వాళ్ళకి ఈ సాధన, ఈ సత్సంగం, శిరిడీ యాత్రలు అంతా కూడా అసలు ఏమవసరం? మనం మహాత్ములం కాదు మనలో బలహీనతలు ఉన్నాయి, పోగొట్టుకోవలసిన గుణాలు ఎన్నో ఉన్నాయి. అవి పోగొట్టుకోవడానికి మనం శిరిడీకి రావాలి. వాడు అటువంటివాడు, ఇటువంటివాడు, అవినీతిపరుడు. వాడు చేసేటటువంటివి ఇవి. ఈ చేష్టలన్నీ చేస్తుంటాడు. వాడు కూడా శిరిడీకి పోతే ఎట్లాగండీ? అనంటాం. పోవలసినవాడు వాడే! మహాత్ముని మహాసమాధి ఆయన అవతార కార్యం మరింత విస్తృతం కావడానికి, వారి మహిమ ప్రవర్ధమానమవడానికి సూచిక. దేశకాలాలకు అతీతమైన ఈ సద్గురుమూర్తుల దివ్యప్రేమ ఎందరో భక్తులను పరిపూర్ణులను చేస్తుంది.

–శ్రీ బాబూజీ



మహాత్ముల జీవన సారాంశమంతా వారి దేహ పరిత్యాగ పుణ్యఘట్టంలో వ్యక్తం అవుతుంది. -'సన్నిధి' నుండి





## జననమే లేని వారికి మరణమెక్కడిది?

సద్గురువులు దేహాతీతులు. వారు దేహాన్ని త్యజించిన అనంతరం వారి మహిమ (తల్లి సంరక్షణ) ఇంకా విస్తృతంగా ప్రకటమవుతుంది. ఎందుకంటే దేహానికి పరిమితులుంటాయి. ఆ పరిమితులు దాటితే వారు అపరిమితులు, అనంతులు. వారు దేహంతో ఉన్నప్పుడు కూడా దేహాతీతులే."నా ముర్షద్ (గురువు) నన్నెప్పుడో ఈ దేహం నుండి విడుదల చేసారు" అన్నారు శ్రీసాయి. అందుకే వారు జీవన్ముక్తులు. వారు నడచి చూపిన సన్మార్గంలో పయనించే ప్రతి ఒక్కరికీ వారి దివ్యసన్నిధి అనుభవమవుతూనే ఉంటుంది" అందుకే బాబా అన్నారు "నా సమాధి మాట్లాడుతుంది. నా సమాధి కదులుతుంది, నా సమాధి సమాధానం చెబుతుంది" అని. ఆయన భౌతికదేహం అంతకుముందు సమాధానమిస్తూ ఉండిన రీతిలోనే దేహానంతరమూ సమాధానమిస్తోంది.

వారు జన్మించలేదు, మరణించలేదు (మరపే మరణం) వారు మనల్ని మరచింది ఎక్కడ. కనుక వారు నిత్యసత్యులు. శ్రీసాయి మాటల్లోనే "నన్ను ప్రసవించినపుడు తనకు కుమారుడు కలిగినందుకు నా తల్లి ఎంతో ఉప్పొంగి పోయింది. నా మటుకు నాకు ఆమె సంతోషం చూచి, ఆశ్చర్యం వేసింది. నిజానికి నన్ను ఆమె కన్నదెప్పుడు?అసలు నాకు పుట్టుక ఉన్నదా? అంతకుముందు మాత్రము నేను లేనా?" అని.

"నీవు తినేటపుడు ప్రక్కన ఎవరైనా ఉంటే వారికి పెట్టావన్న మాట నిజమే. ఎవరూ లేకపోతే పెట్టకుండా తినడం నీ తప్పుకాదు. అది సరే! కానీ, మరి నా మాటేమిటి? నేనెప్పుడూ నీతో(లో)నే ఉన్నాను కదా" అంటారు శ్రీసాయి హేమాడ్‌పంత్‌తో. ఇలా వారి ఉనికిని దేహకాలాల కతీతంగా తెలియచేస్తున్నారు సద్గురువులు.

వారు దేహాన్ని త్యజించిన అనంతరం వారి మహిమ (తల్లి సంరక్షణ) ఇంకా విస్తృతంగా ప్రకటమవుతోంది. ఎందుకంటే దేహానికి పరిమితులుంటాయి. ఆ పరిమితులు దాటితే వారు అపరిమితులు, అనంతులు. వారు దేహంతో ఉన్నప్పుడు కూడా వారు దేహాతీతులే, అందుకే వారు జీవన్ముక్తులు.

– గురుకృప



చూసేవారికి సూర్యాస్తమయంగానీ- సూర్యునికి కాదు కదా! సత్యదర్శనులకు 'మృత్యు'వంటే -'మార్పే'నని ప్రబోధిస్తారు. -'సన్నిధి' నుండి



**మూడవ అంశం,** ఏది మనలో ప్రేమను కలిగిస్తుందో ఆ సాంగత్యంలో ఉండటం, దానిమీద దృష్టి ఉంచడం, మనం మన లక్ష్యంపట్ల మనకు గల తదేకతను పెంపొందించే పనులు చేస్తున్నామా? నిజంగా అటువంటి పనులే చేస్తున్నామా? మన లక్ష్యంపట్ల మనం జాగ్రత్తగా ఉంటున్నామా? మన ధ్యేయం స్థిరంగా ఉందా? మనం దానిని గుర్తుపెట్టుకుంటున్నామా? లేదా మరచిపోతున్నామా? మీరు రోజు ఎలా గడుపుతున్నారు అనే దానిని గమనించండి – గత ఇరవై సంవత్సరాల సంగతి కాదు – అది అవసరం లేదు, ఒక్క రోజును పరిశీలించండి! మీరు ఒక్కరోజును మచ్చుకి తీసుకొని, మీరు ఎలా గడుపుతున్నారో పరిశీలించుకోండి. మిమ్మల్ని మీరు “నేనిక్కడకు ఎందుకు వచ్చాను? నేను ఏం చేస్తున్నాను? నేను ఏం ఆశిస్తున్నాను?” అని రోజుకు ఒక్కసారైనా ప్రశ్నించుకుంటున్నారా? “మేమిక్కడకు ఆత్మవిచారణ కోసం, రమణ మహర్షి కోసం, భగవానుల కోసం, అరుణాచలేశ్వరుని కోసం, బాబా కోసం, గురువుగారూ, మీ కోసం” ఇక్కడకు వచ్చామనో అనవచ్చు. అయితే వచ్చి మీరిప్పుడు ఎన్ని గంటలు లేదా ఎన్ని నిమిషాలు – **“గంటలు” అనడం మరీ ఎక్కువేమో - ఎన్ని నిమిషాలు మీరు నిజంగా ఆ విషయం మీద దృష్టి పెట్టి గడిపారు?** నిజాయితీగా సమాధానం చెప్పండి. పోనీ, గడిచిన ఇరవైనాలుగు గంటల్లో మీ లక్ష్యం కోసం మీరేం చేశారు? ఆలోచించండి మీరు ఇక్కడెందుకున్నారు? మీరు మీ లక్ష్యాన్ని, మీ ధ్యేయాన్ని గుర్తు పెట్టుకుంటున్నారా? మిమ్మల్ని మీ లక్ష్యం నుండి దూరం చేసే ఇతర ప్రభావాల నుండి, ఆకర్షణల నుండి, కార్యకలాపాల నుండి మిమ్మల్ని కాపాడుకోవడానికి నిజంగా ప్రయత్నిస్తున్నారా? మీరు నిజంగా మీ లక్ష్యంవైపు, ప్రేమించే మీ ధ్యేయంవైపు అడుగులేస్తున్నారా? అలా అయితే అందుకోసం నిజంగా మీరేం చేస్తున్నారు? చివరిది, నేను పదే పదే చెప్పేటటువంటిది, మనమందరం గుర్తుపెట్టుకోవాల్సిన ప్రాథమికమైన, అత్యంత **ముఖ్యమైన విషయం : జీవితం యొక్క అల్పత్వం - ఎంత చిన్నది ఈ జీవితం! మీరు సమయాన్ని ఎలా గడుపుతున్నారో, ఎలా వృథా చేస్తున్నారో చూడండి.** రేపు మనం ఎక్కడుంటామో మనకు తెలియదు. అయినప్పటికి మనం శాశ్వతమైనట్లు, అజరామరులమైనట్లు సృష్టి లయించే వరకు ఉండబోతున్నా మనుకుంటూ ప్రణాళికలు వేసుకుంటూ, కూడబెట్టుకుంటూ, కాపాడుకుంటూ” ఇవన్నీ అవసరమా? స్పష్టమైన అవగాహన తెచ్చుకోండి.

**- శ్రీబాబూజీ, శరశ్చంద్రికల నుండి**



**దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు విజ్ఞులు అనుభవజ్ఞులను ఆశ్రయిస్తారు. ఆ అనుభవాన్ని అంటిపెట్టుకుంటే జీవితానికి వారే దిక్కు అన్న అవగాహన కలగడమే అనుభవాన్ని అంటిపెట్టుకోవడం అంటే. - గురుకృప**





సంపుటి : 21
సంచిక : 5




నవంబర్ 13
2018



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ ‘సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!’
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

4 పథగామి - గురుకృప
9 చేస్తున్న పనే పూజ ... - గురుకృప
13 ఓ మహిత ఆదర్శానికి ..... - గురుకృప
16 గురుకృపాలహరి - గురుకృప
19 నైవేద్యం - బాబూజీ
23 లక్ష్యసిద్ధిని లభింపచేసే.... - శరశ్చంద్రికలు



నిర్వహణ : *గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు*

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info


## పథగామి




**"లోకంబులు లోకేశులు**
**లోకస్థులు దెగిన తుది నలోకం బగు పెం**
**జీకటి కవ్వల నెవ్వడు**
**నేకాకృతి వెలుగు నతని నే సేవింతున్."**

గజేంద్రమోక్ష ఘట్టంలోని పోతన పద్యమిది. లోకాలు, లోకాలను పాలించేవారు అన్ని లోకాలలోనూ ఉండేవారు కూడా నశించిన అనంతరం, ఆ కారుచీకట్లకు అవతల అఖండమైనరూపంలో ప్రకాశించే ఆ 'వెలుగు'ను (దైవాన్ని) నేను సేవిస్తాను అంటాడు గజేంద్రుడు పోతన మాటల్లో. అంతగొప్ప వెలుగు మన జీవితాల్లో దర్శించడం సాధ్యమేనా? నిజానికి ఏమిటి ఆ వెలుగు – దానికి భాగవతం చెప్పిన ఉపమానం – 'ఏకాకృతి' అంది. ఆ 'ఏకాకృతే' – ఆ 'వెలుగే' ఈ సృష్టి మొత్తానికి మూలమని చెప్పింది. సృష్టి రహితమైన స్థితి నుండి – సృష్టి సహితమైన స్థితి, ఈ చరాచర జీవులు, భాసించే వస్తు, వ్యవస్థ సముదాయాలన్నీ ఆ 'ఏకాకృతి' నుండి రూపుదాల్చాయట. ఆ 'వెలుగే' ఇన్ని రూపాలుగా భాసిస్తోంది అంటాడు భాగవతఘన పోతన. అందుకే ఒక్క ముక్కలో 'సర్వమూ తానైన వాడు' అన్నాడు తన మాటల్లో. మరోచోట 'మూలకారణుడు' అని చెప్తాడు. గీతాచార్యుడు కూడా ఇలానే చెప్పాడు. "ఈ సృష్టిలో ఉన్న చరాచరాలన్నీ నా ఆత్మజ్యోతి స్వరూపమే'' అని.

యుగాలు, తరాలు, కాలాలు మారిపోయాయి. మనుష్యత్వం, రాక్షసత్వం ఒక్క జీవిలోనే నిలిచి నడిచిపోతోంది యుగం. తంతు తలకెక్కింది – జ్ఞాన విపంచి నేలకొరిగింది. ఆ ఉత్కృష్టమైన 'వెలుగు'కు సూక్ష్మరూపంగా – 'దీపం'గా వెలిగించుకుంటున్నామన్న స్పృహ మనలో కొరవడింది. అప్పుడు మరల మన అంతరంగంలోని చిక్కటి నిశీధిలో మనం కరిగిపోయి, కలసిపోయే ఆ నిమిషంలో మనలను కాపాడాలని కరుణతో వేంచేసిన ఆ గొప్ప 'వెలుగు' – 'గురువు'. ఈ జగత్తంతా 'వెలుగు' నిండినా అంతఃకరణం చీకటయితే మన మనుగడ ప్రశ్నార్థకమే కదా! గురువు బాహ్యంగా వెలిగించే ఆ 'దీపం' – మన అంతరంగంలోని చీకట్లను పారద్రోలాలన్న అవ్యాజమైన వారి అనుగ్రహానికి కేవలం సూచ్యార్థమే! ఏమిటి ఆ చీకట్లు అంటే మనలోని 'అసుర' భావాలన్నారు పెద్దలు... మా



**ఆధ్యాత్మికత అంటే ప్రేమను అనుభవించడం, ప్రేమను వ్యక్త పరచడం. ఏదైతే మనల్ని అన్ని రకాలుగా ఉత్తేజపరిచేది. జీవితంలో సంపూర్ణంగా పాలు పంచుకోవడం, సంపూర్ణంగా జీవించడం.**






**గురువుగారు :** ముందుగా ఇతరుల్ని నిందించడం ఆపండి. స్పష్టంగా ఉండండి! అపుడు అది సులభమవుతుది. మనల్ని మనం భ్రమలో పెట్టుకొని దానిని ఒక సమస్య చేసుకుంటాం. తర్వాత అది ఒక అలవాటుగా, ఆలోచనాసరళిగా మారుతుంది. అందుకనే నేను చెప్పేది: ముందు మీరు దానిని ఆపితే – ప్రపంచంలో మీరు నిందించడానికి ఇక ఎవ్వరూ లేకపోతే – మీకు నిందించుకోవడానికి మీరు, లేదంటే బాబా తప్ప ఇక ఎవ్వరూ లేరనే కనీస స్పష్టతన్నా వస్తుంది.

ఇపుడు నేను చెప్పేదానిని ప్రతి ఒక్కరూ తమ స్వంత సమస్యలను ఆధారం చేసుకొని, వారి వారి అవగాహనను, దృక్పథాన్ని అనుసరించి, తమతమ రీతుల్లో అర్థం చేసుకుంటారు. కానీ అందరికీ వర్తించే(సార్వత్రికమైన) విషయానికొస్తే – అందులో మూడు అంశాలు ఉన్నాయి. వీటిని ఎప్పుడూ గుర్తుంచుకోండి. ఇప్పటి వరకు జరిగిన అన్ని సత్సంగాలు, నేను గంటల తరబడి మాట్లాడిన మాటలు – వీటన్నింటికీ ముఖ్యమైనవి మూడు అంశాలు.

**మొట్టమొదట** మీకొక లక్ష్యం, ఒక ధ్యేయం వుండాలి. మీకు ఏం కావాలో, మీరు దేని కోసం తాపత్రయపడుతున్నారో మీకు తెలియాలి. ఒకవేళ మీకు ధ్యేయమంటూ ఒకటి వుంటే ఆ ధ్యేయాన్ని గుర్తుపెట్టుకోండి. మీరు తిరువణ్ణామలైకిగాని, శిరిడీకిగాని వస్తున్నపుడు మీకొక ధ్యేయమో లేదా లక్ష్యమో ఉందని భావిస్తారు. కనీసం ఏదో ఒకటి ఉందనైనా అనుకుంటారు. అది ఏదైనా సరే, అసలు మీరు దానిని గుర్తుంచుకుంటున్నారా? మనం ఇక్కడ ఎందుకున్నాము? మనం ఎందుకోసం వచ్చాము? దీనిని ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి.

**రెండవది** మనం లక్ష్యంపట్ల, ధ్యేయంపట్ల మనకుండే ఈ ఎఱుక, మన చుట్టూ ఉండే రకరకాల పరిస్థితుల వల్ల నీరుగారి పోకుండా, దారితప్పిపోకుండా, మరలి పోకుండా, కాపాడుకుంటూ, మనల్ని ఆకర్షణకు లోనుచేసే పరిస్థితులను కట్టడి చేసుకుంటూ, మన లక్ష్యానికి దూరం కాకుండా ఉండాలి. మన లక్ష్యం, దానిమీద మనం దృష్టిపెట్టడం రెండూ పరస్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. కాబట్టి మన లక్ష్యంపట్ల మనం నిజంగా జాగరూకతతో ఉన్నామా, లేక ప్రక్కకు లాగబడి దారి తప్పి పథభ్రష్టులమయ్యామా అని తెలుసుకోవడానికి, ప్రతిరోజూ మీరు ఏం చేస్తున్నారు? ఎక్కడికి పోతున్నారు? అనే విషయం చూసుకోండి.



**ప్రేమానురాగాలు మన మనశ్శాంతికి భంగం వాటిల్లే స్థాయికి చేరాయంటే అవి బంధమోహాలే. - గురుకృప**



**గురువుగారు :** దృష్టిని నిలుపుకోవాల్సిన అవసరం లేదు. లక్ష్యం ప్రేమ నుండి వచ్చినదైతే, దృష్టిని నిలుపుకోవడానికి నిర్వహణా బాధ్యతలు నిర్వర్తించాల్సిన అవసరముండదు (గురువుగారు నవ్వుతూ) మీకు గనుక ప్రేమ వుంటే, మీరు దృష్టి పెట్టే లక్ష్యాన్నుంచి మీరు ప్రక్కకు మళ్లలేరు, మీవల్లకాదు. అదీ లగ్నం చేయడమంటే. మీరు ఒకరిని ప్రేమించారంటే, ఆ వ్యక్తి గురించి ఆలోచించకుండా ఉండటమనేది చేయలేరు. మీ ఆలోచనలు ఎప్పుడూ తిరిగి తిరిగి ఆమె మీదకో, లేదా అతని మీదకో పోతూనే ఉంటాయి. కానీ కొన్నిసార్లు పాత అలవాట్లు లేదా పాత సాంగత్యాల వల్ల, మనం ప్రేమిస్తున్నప్పటకీ కొన్ని విచారకరమైన ఆలోచనలు వస్తుంటాయి. మనం వాటిని దూరం చేసుకోవాలనుకున్నప్పటికి మన వల్ల కాదని తెలుస్తుంది. లేకపోతే కొన్ని అడ్డంకులు వస్తాయి. మనం ఎదుర్కోక తప్పని అడ్డంకులెదురవుతాయి. ఇటువంటి సందర్భాలలో మన దృష్టిని నిలుపుకోవడానికి ఇతర విషయాలు – సత్సంగం, మంచి సాంగత్యం, మనం ఇక్కడ ఎందుకున్నాం, మన లక్ష్యమేమిటి అని ఆలోచించడం – ఇటువంటి మంచి విషయాలు సహాయం చేస్తాయి. మీరందరికీ ఇలాగ దృష్టిని నిలుపుకోవడానికి అవసరమైన సూత్రాలు బాగా తెలుసు. మీకు నచ్చినదానిని ఉపయోగ పెట్టుకోండి.

**భక్తుడు :** గురువుగారూ, మా సంతోషానికి, దుఃఖానికి మేమే బాధ్యులమని అంగీకరించగలిగితే మేము ఆనందంగా ఉంటామని చెబుతున్నారా?

**గురువుగారు :** మీరు ఆనందంగా ఉన్నా లేకపోయినా, మీరు ఏ దుఃఖమైతే బయటినుండి వస్తుంది అనుకుంటున్నారో కనీసం అదన్నా ఆగిపోతుంది.

**భక్తుడు :** ఆ బాధ్యత మాదేనని అంగీకరించడం వల్లనా?

**గురువుగారు : మీ ఆనందానికిగాని, దుఃఖానికి గాని ఇతరులు బాధ్యులు కారని తెలుసుకోవడం ద్వారా, ముందు మీరు వాళ్లకు విముక్తి కల్పిస్తారు, తరువాత వాళ్ల నుండి మిమ్మల్ని మీరు విముక్తుల్ని చేసుకుంటారు, కొంతలో కొంతైనా ఓ విధమైన స్వాతంత్ర్యం , విముక్తి పొందుతారు.**

**భక్తుడు :** గురువుగారూ, ఆ విధంగా మమ్మల్ని మేము చూసుకోవడం ఎలా? మేమే (ఆనందానికి, దుఃఖానికి) బాధ్యులమని నిజంగా తెలుసుకోవడం ఎలా?



**ఏ పనినైనా మొదలుపెడితే దానిని పరిపూర్ణంగా చేయాలంటారు శ్రీబాబూజీ.**





గురుదేవులన్నారు "ప్రేమ, మమత సమతలకు ప్రతిరూపమైన శ్రీసాయి ప్రబోధ పథంలో ముందుకు సాగనీయకుండా అడ్డుపడే బూజు పట్టిన ఆచారవ్యవహారాలపట్ల, కుల, మత, జాతి వివక్షతల పట్ల మనకుండే మూర్ఖమైన మూఢవిశ్వాసము".

ఆలోచిస్తే ఇవే అసలు చీకట్లు. కుక్కను కొడితే ఆ దెబ్బను తన వీపున చూపిన శ్రీసాయి ఆ 'ఏకాకృతి' అయిన 'వెలుగు' కాక మరేమవుతారు. "మనందరం శ్రీసాయి నుండి విడివడిన వారమే" అన్న పూజ్య గురుదేవుల మాటలే నిజమైన 'దీపాలు'. ఎవరో రాసుకున్నట్లు "దీపాలను వెలిగించావు, చీకట్లను తొలగించావు, మా మనసులు పాలించావు ఓ గురుదేవా" అని. ప్రతి నిత్యం మనం వారి ముందు వెలిగించే ఆ దీపం – వారి అనుగ్రహానికి ప్రతిరూపం అని అవగతం చేసుకుంటే శ్రీసాయి చెప్పిన "అడ్డుగోడ కూలిపోతుంది – మనం వారిలో భాగమని తెలిసిపోతుంది".

**దీపం - అఖండమైన ఆ 'వెలుగు'కు సూక్ష్మరూపం :**


వెలిగించిన దీపానిది ఎప్పుడూ 'ఊర్థ్వ' ముఖమే. మనకు అది గుర్తు చేసేది అభ్యుదయం, ఎదిగే స్వభావం. ఇంకో అర్థం 'స్పష్టత'. చిమ్మచీకట్లు అలముకున్న క్షణాన కూడా ఒక చిన్న 'దీపం' మనకు వస్తు విషయాలను స్పష్టంగా చూపిస్తుంది. మన త్రికరణాలు ఏకమైన రోజునే కదా మనకు మన జీవితాలలో 'స్పష్టత' ఏర్పడేది. వెలిగే ఆ **'దీపం'–'స్పష్టత'కు ప్రతిరూపం** అన్న విషయం కూడా గుర్తుంచుకోవాలి. సద్గురుపథంలో అది మనలను మనం సదా తరచి చూసుకునే వెలుగు– దీపం. మనం ఏ పని చేస్తున్నా అది ఎందుకు చేస్తున్నాం? అది మనలను బాబాకు దగ్గర చేసేదా? దూరం చేసేదా? గురువు చెప్పిన మార్గంలో అడుగులేనా అవి? మరల వారు సదా హెచ్చరించే 'చీకటి' మార్గంలోకి వెళ్ళిపోతున్నానా? ఈ మీమాంసలో మనసనే వత్తి వెలిగిననాడు చీకటి తొలగి స్పష్టమైన సద్దర్శనమవుతుంది.

**కాకతాళీయమా ? సాయి కరుణాలయమా ?**

అంతగా శ్రీసాయిబాబా పరిచయం లేని (ఋణానుబంధం లేని) భారతీయులకు కూడా శ్రీసాయిబాబా అనగానే ఠక్కున గుర్తొచ్చే లీల – బాబా నీటితో మసీదులో దీపాలను వెలిగించడం.



**స్పష్టమైన ఆనందం, తృప్తి అనుభవమయ్యే దిశగా మనలను నడిపిస్తూ, జీవితాన్ని సాధ్యమైనంత సంపూర్ణంగా అనుభవించేటట్లు చేస్తూ జీవితానికి నిండుదనాన్ని ఇచ్చేది నిజమైన ఆధ్యాత్మికత.**



మన దుర్గుణాలనే తైలాన్ని భిక్షగా స్వీకరించి – సద్గుణాల నీటిగా మార్చి, ఆ నీటితోనే దీపాలను వెలిగించిన అనుగ్రహ చక్రవర్తి శ్రీసాయి. దుర్గుణాలను వారికి సమర్పణ చేస్తే ఉద్ధరించడానికి వారు సిద్ధంగానే ఉన్నారు. నూనె వ్యాపారులలా మనం కూడా ఉంటామంటే ఇక మన ఇష్టం. నాడు శ్రీసాయి వెలిగించిన దీపాలు, శతవసంతాలైనా అప్రతిహతంగా భక్తుల మనోమందిరాల్లో వెలుగుతూనే ఉన్నాయి. ఆ వెలుగులను దర్శించిన భక్తులు పరిపూర్ణులు అవుతున్నారు. ఆ వెలుగును దర్శించాలన్న తపన ఉన్న జీవులు తన్మయులవుతున్నారు. దీపమే మరో దీపాన్ని వెలిగించగలదు. అలా శ్రీసాయి వెలిగించిన మరో అఖండ ప్రేమదీపం శ్రీబాబూజీ. గురువనే 'వెలుగు'లోనే శ్రీసాయి సత్స్వరూపం దర్శించే ప్రయత్నం చేసే అవకాశం వచ్చింది. "నా చర్యలు అగాధాలు, ఎవరైతే వాటిని స్మరిస్తారో వారికి జ్ఞాన రత్నాలు లభిస్తాయి" అన్నారు బాబా. పూజ్యశ్రీబాబూజీ 'సాయిపథం' పునాదిరాయి వేసి అక్కడ వెలిగించిన సుజ్ఞాన ప్రేమ దీపమే మాకు నేటికీ ఆరాధనీయమయింది. వారు ప్రత్యేకంగా అక్కడ దీపం వెలిగించమని చెప్పడం వెనుక అంతరార్థం ఆలోచనలకు అందేదా? వారి మాటల్లోనే చూస్తే "అదే అస్పష్టత నుండి స్పష్టత వైపుకు ప్రయాణం. ప్రతి ఒక్కరిలో ఏదో పొందాలనే తపన. కానీ అ పొందాలనుకునే దానికి ఓ రూపునివ్వలేని అస్పష్టత. ఆ అస్పష్టతకు సాయివంటి 'సద్గురు సన్నిధిలో' ఓ 'స్పష్టమైన రూపు' వచ్చి తనకు కావలిసినదేదో తెలుసుకునే సామర్థ్యం కలిగి అవి తీరగల పరిస్థితులు సంభవిస్తాయి. అప్పుడే స్పష్టమైన క్రియాశీలత రూపుదిద్దుకుంటుంది" అంటారు శ్రీబాబూజీ. మనకు ఆ స్పష్టత లభించాక అడుగులు వేస్తేగాని అవగతం కాదు – గురువే దైవమా? దైవము గురువు ఒక్కటే స్వరూపమా? అన్న విషయం. ఏది ఏమైనా ఆ వెలుగులలో సద్దర్శనం మాత్రం తథ్యం.– అందుకు గురువే నేపథ్యం.

## వెలిగే దీపానికి ఆరాధన... వెలిగించిన వారికి నివేదన:

మనతరం చూసిన మహాత్ములలో ఒకరైన శ్రీపాకలపాటి గురువుగారు నర్సీపట్నంలోని గిరిజనులకు కష్టాలు ఎదురైతే ఆ గ్రామంలో ఒక చోట ఒక మేకు పాతి అక్కడ ఎప్పుడు కష్టం వచ్చినా ఒక 'దీపం' వెలిగించుకుని అక్కడ చెప్పుకొమ్మనే వారు. కల్మషంలేని ఆ గిరి వాసులకు ఆ దీపమే దైవనివాసమై కష్టాలను తీర్చేది. దీపారాధన – 'దీప' – 'ఆరాధన' భారతీయులకు ఎంతో



**బుద్ధిక్షేత్రంలో భక్తి (అవ్యాజప్రేమ, అనన్యప్రేమ) మొక్కలు నాటి అష్టదళ (భావాలు-అహింస, ఇంద్రియనిగ్రహం, దయ, క్షమ, ధ్యానం, తపస్సు, జ్ఞానం, సత్యం) సుమాలతో సద్భావన జీవనమే మన గురువుకు అతంకరించే నిజమైన పూదండ. ఇది ఎన్నటికీ వాడనిది. అట్టి సమర్పణ మనకు చరితార్థతనిస్తుంది. -గురుకృప**








ఎన్నడూ అలా చేయలేదు. ఇక్కడకు వచ్చి "మేమిక్కడ ఎంతో సంతోషంగా ఉన్నాం, మాకు ఇక్కడ సంతృప్తిగా ఉంది. మేము మీ కోసం వచ్చాం" అని చెప్పింది మీరు. **నిజంగా మీరు నా కోసం వచ్చుంటే దానిని చేతల్లో చూపించండి. ఆమూలాగ్రమూ అలా చేయండి.** అలా కాకపోతే, ఎందుకు ఇక్కడ మీ సమయం వృథా చేసుకోవడం? వెళ్లి మీకు మరింత లాభమొచ్చేటటువంటి, ఉపయోగకరమైన ఇతర విషయాలను సాధించుకోండి. నా ఉద్దేశ్యమిది. మీకు ఒక **లక్ష్యాన్ని నేనెన్నటికీ నిర్దేశించను. మీ లక్ష్యాన్ని సాధించడానికి నేను సహాయం మాత్రమే చేస్తాను.** మీ లక్ష్యం మీరే నిర్ణయించుకోవాలి. అలా నిర్ణయించుకున్న తరువాత, ఇతర బంతులు వచ్చి మీ లక్ష్యాన్ని తాకకుండా మంచి గోల్‌కీపర్‌లాగా దానిని కాపాడుకోవాలి.

**గురువుగారు :** నేను ఈ విషయాన్ని ఎన్నోసార్లు చాలా చాలా స్పష్టంగా చెప్పాను. "ఇది చాలా మంచి లక్ష్యం, దాని తరువాత రెండవస్థానం ఆ లక్ష్యానిది" అని మీ లక్ష్యాల విషయంలో నేనెప్పుడూ సలహాలివ్వను. మీ లక్ష్యం యొక్క ఎంపిక మీదే. మీ లక్ష్యాన్ని మీరే ఎంచుకోవాలి. **ఎలా ఎంచుకోవాలి? ఇది నేను చెప్తాను.** ఏదైతే మీకు అత్యంత సంతోషాన్ని కలిగిస్తుందో, మీ హృదయంలో ఎక్కువ ప్రేమను కలిగిస్తుందో అటువంటి దానిని ఎంపిక చేసుకోండి. అది ఏదైనా ఫరవాలేదు. అది సామాజిక సేవయినా, పర్యావరణ సంరక్షణయినా మరేదైనా సరే వెళ్లి ఆ పని చేయండి. మీకది ఆనందాన్నిస్తూ ఉంటే వెళ్లండి. అది మీ లక్ష్యమైతే నేను దానికి వ్యతిరేకిని కాదు. అంకితభావంతో, సంతోషంతో ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనేవారిని నేను గౌరవిస్తాను. వారు దారి తప్పారనో, ఆధ్యాత్మిక పంథాలో లేరనో నేను అనను. వారిపట్ల నాకు అంతే సమంగా గౌరవభావముంది. అయితే మీ లక్ష్యాన్ని మీరే ఎన్నుకోవాలి. వాళ్ళ వాళ్ల లక్ష్యం పట్ల ఎంత అంకితభావంతో, తదేకతతో ఉన్నారో మీరూ మీ లక్ష్యం పట్ల – అది బాబాను ప్రేమించడమైనా, మరొకటైనా – అంతే తదేకతతో ఉండాలి. అందరికీ నేనిచ్చే సలహా ఏమిటంటే, **మీ హృదయంలో ప్రేమను కలిగిస్తూ, మిమ్మల్ని ఆనందభరితుల్ని చేసేటటువంటి దానిని ఎన్నుకోండి, దానికి కట్టుబడి ఉండండి, దానిపైన ఇంకా ఇంకా దృష్టి పెట్టండి.**

**భక్తుడు :** కానీ గురువుగారూ, మా లక్ష్యంపట్ల దృష్టిని (ఫోకస్) నిలుపుకోవడం ఎలా? క్షణమాత్రంలో దానిని కోల్పోవచ్చునిపిస్తుంది.



**మనం ఏ పని చేసినా, మన శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా వినియోగించి నేర్పుగా, పరిపూర్ణముగా చేయాలన్న స్ఫూర్తిని తమ ఆచరణ ద్వారా కలిగిస్తున్నారు శ్రీబాబూజీ. - గురుకృప**



చేయడం, మనల్ని మనం ఎంత వీలైతే అంత బాబా సన్నిధిలో ఉంచుకోవడం, శిరిడీకి వెళ్లడం ద్వారా భౌతికంగా కూడా ఆయన సన్నిధిలో ఉండడం, ఇవన్నీ తిరిగి తిరిగి అయస్కాంతంతో రుద్దడం వంటివే. తద్వారా మనం సామరస్యాన్ని సాధిస్తాం.

**గురువుగారు :** నేను మిమ్మల్ని ఫలానా పనిచెయ్యమని అడగడంలేదు. మీరు వచ్చి మేము ప్రేమించేటటువంటి లక్ష్యం (సద్గురువు) 'ఫలానా' అని అన్నప్పుడు మీ ఆనందం అందులోనే వుందని చెప్పినపుడు, మీరు దానిని పొందేదాకా దాని మీదనే లగ్నం చేయండి అంటాను. "నా ఆనందం ఇందులో ఉంది" అని మీరు అంటున్నారు కానీ దానికోసం ఏమీ చేయడం లేదు. దానిమీద దృష్టి పెట్టండి! మీరు, "నేను పరీక్షలో పాస్ కావాలనుకుంటున్నాను. ఇది నాకు చాలా అవసరం, నాకు ఈ డిగ్రీ కావాలి" అంటారు. వచ్చి ఇలాగే అడుగుతుంటారు. నేను చెప్పగలిగింది ఏముంటుంది? "మంచిది, మీకు నిజంగా అంతగా పాస్ కావాలనుకుంటే కష్టపడి చదవండి!" అంటాను. నేను మిమ్మల్ని పరీక్షలో పాస్‌కమ్మని చెప్పడం లేదు, ఆ డిగ్రీ తెచ్చుకోమని చెప్పడంలేదు, అలాంటిదేం లేదు. కానీ మీరు నా దగ్గరకు వచ్చి, "నాకు ఈ డిగ్రీ కావాలి, నేను ఈ పరీక్షలో పాస్ కావాలి"! అని చెప్పినపుడు, నేను 'ఇదిగో ఇలా చెయ్యండి' అని చెప్తాను. మీరు ఈ పరీక్షలో పాస్ కావాలనుకుంటున్నాము అని చెప్తూ, రోజూ సినిమాలకు పోతూ, స్నేహితులతో పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుంటూ, సముద్రపు ఒడ్డున తారట్లాడుతూ ఉంటే, అపుడు నేను "ఇది పద్ధతి కాదు, మీ రూములో కూర్చుని కష్టపడి చదవండి" అంటాను. ఇదీ నేను చెప్పేది.

మీరు గనుక, "లేదు, లేదు, నేను ఇంత కష్టపడి చదవాల్సివస్తే నేను ఈ పరీక్షలో పాస్ కావాలనుకోవడం లేదు, ఇదంతా అవసరం లేదు" అన్నారనుకోండి. అపుడు మీకు కనీసం ఆ స్పష్టతయినా ఉంటుంది! అలా కాకుండా మీరేమో నా దగ్గరకొచ్చి, "గురువుగారూ! మేము అంతదూరం నుండి మీ కోసం వచ్చాము, మీ సాన్నిధ్యాన్ని పూర్తిగా అనుభూతి చెందాలనుకుంటున్నాం గురువుగారూ!" అని చెబుతున్నారు. ఇలా చెప్పినపుడు "అలా అయితే సరైన పద్ధతిలో చెయ్యండి" అని మాత్రమే నేను చెప్పగలను. నేను చెబుతున్నదీ అదే. (గురువుగారు గుసగుసలను అభినయిస్తూ..) "రండి, నా సాన్నిధ్యాన్ని అనుభవించండి!" అని నేను మిమ్మల్ని ఇక్కడకు రమ్మని పిలువలేదు. నేను



**తాను తెలుసుకున్న సత్యాన్ని అందరితో పంచుకొని, ఆశ్రయించిన వారికి ఆ సత్యానుభవాన్ని సాయి అనుగ్రహాన్ని ప్రసాదించిన మహాత్ములు శ్రీబాబూజీ.**

**- గురుకృప**







ప్రీతిపాత్రమయింది. భ- వెలుగు; రతి -ప్రేమించడం. వెలుగును ప్రేమించే వారని మరో కోణం ఉంది. వెలుగును ఇష్టపడే భూమి కనుకనే వెలుగుదివ్వెల్లా మహాత్ములు ఈ దేశాన విలసిల్లి భూమండలానికి దిశానిర్దేశం చేస్తున్నారేమో! మన లోపల అలుముకున్న చీకట్లను తొలగించిన మహాత్ముడు గురువై మనలను గమ్యం చేరుస్తాడు. బాహ్యంగా మనం చేసే దీపారాధనకు చరమాంకం మనకు దర్శనమిచ్చిన ఆ 'వెలుగు'కు అంటే గురువుకు మనం నివేదనగా మారడమే.

దీపమే దైవమయింది ఇక్కడ. 'వెలుగు' దైవానికి సాకారమయింది. మౌఢ్యాలన్నీ తొలగి ఆ 'గిరి' జనులలో సద్గురు 'గిరి' వెలసిందని చెప్పుకోవచ్చు.

**దీపం... తెలుసుకుందాం మన స్వరూపం... :**

పత్తితో చేసిన వత్తే దీపమైతే మన ప్రవృత్తి మార్చుకుంటే మనకి శ్రీసాయి సత్స్వరూపం దర్శనమవ్వకపోతుందా? దీపాలను వెలిగించడంతో ఆగిపోలేదు. సర్వజీవ స్వరూపంలో నేనే విలసిల్లుతున్నానన్న అవగాహన కలిగించి, శ్రీబాబూజీ వంటి సమర్థ సద్గురువును ప్రసాదించి వెలిగించే ఆ చిన్న దీపాన్ని ఎలా అఖండమైన వెలుగుగా మలచుకుని సద్గురు విశ్వరూప స్వరూపాన్ని దర్శించుకునేందుకు మార్గాన్ని సుగమం చేశారు శ్రీసాయి. ఆ మహితాత్ముని అడుగుజాడల్లో మనోమయమైన చీకట్లను తొలగించుకుందాం. మన వృత్తి ఏదైనా కావచ్చు - కానీ మన ప్రవృత్తి మాత్రం సాయిమార్గమయ్యేట్లు చూసుకుందాం. అందుకు అడ్డువచ్చే అంశాలను తులనాత్మకంగా పరిశీలించుకుని నివృత్తి చేసుకుందాం. చివరగా ఒక్క అంశం **"శ్రీబాబూజీ ఇంత మంది హృదయాలలో వెలిగించిన బాబా ప్రేమ అనే దివ్వె(దీపం) అలాగే వెలుగుతూ ఉండాలి, దాన్ని మనలోనూ, మన చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరిలోనూ మనం దర్శించుకోగలగాలి. అప్పుడే ఆ దీపం పరిరక్షింపబడుతుంది. దానికి వారు ప్రసాదించిన పారాయణ, సత్సంగం, భజన, గురుబంధువులు, మనందరం దోహదమవ్వాలి." నాలో, నీలో, మీలో, మనందరిలో, ఈ చరాచర జగత్తంతటిలో 'వెలుగు'తున్న ఆ అఖండదీపం -'గురువు'కు నమస్సులర్పిస్తూ ఆరాధనాపూర్వక ప్రణామములు అర్పిస్తోంది గురుకృప.**

**- గురుకృప**



**ఎవరికైనా ప్రాపంచిక కోరికలు, అవసరాలు వారి ఆధ్యాత్మిక పురోగతికి అవరోధమేమోగాని, సాయిభక్తులకు అవి అవరోధం కాదు అంటూ "వారి కోరికలు తీరి సౌఖ్యం చిక్కాక నన్ను అనుసరించి, ఆధ్యాత్మికంగా పురోగమిస్తారు" అన్న బాబా ప్రబోధాన్ని గుర్తు చేస్తారు శ్రీబాబూజీ.**



# నిత్యజీవన యోగసాధన

సకల సాధనలు చేసిన పిమ్మట, కొంత కాలమునకు దాని సాధన ఫలితము దక్కును, లేనిచో దక్కదు అను ఆలోచనకు స్వస్తి చెప్పి, నిరంతరము సాధన చేయు ప్రయత్నమునందే నిజమైన పురోభివృద్ధి కలుగుచుండునని సాధకుడు తెలుసుకొనవలెను. సత్కర్మాచరణ సాధన ద్వారా ఆనందము వ్యక్తమగుచుండునని కూడా అనుభవమునకు వచ్చును. సక్రమముగా సాధకుడు ప్రయోజకుడు కావలెను. ప్రయోజకత్వమే తన సాధనకు స్వరూపముగా దాల్చవలెను. నేను అవతారమూర్తి భక్తుడను, నేను సద్గురువు ప్రియశిష్యుడను. నేను నమ్మిన స్వామియే ప్రపంచమున గొప్ప, అని చాటుకొనుట, గొప్పలు చెప్పుకొనుట వలన తనకు ఏమియు సిద్ధించదని-కేవలము వారి అడుగుజాడలలో నడచుట వలనగాని లేదా వారి సత్ప్రవర్తన వలనగాని మాత్రమే తనకుగాని-తనవలన ఇతరులకుగాని ప్రయోజనముండునని, నేను సాధకుడను, శిష్యుడను, భక్తుడను అని తలచుచున్న ప్రతి ఒక్కరు గమనించవలెను. ఇట్టి గమనిక కలగనపుడు ఆయా వ్యామోహములలో జీవితము గడచిపోయి సాధించగలిగినది ఏమియూ లేక జీవితమున చివరకు తృప్తి లేకుండపోవును. కనుక తానే విషయములలో జాగరూకత వహించవలెనో తక్షణము గ్రహించి వాటిని సరిదిద్దుకొనుటకు ప్రయత్నము చేయుటలో బద్ధకించరాదు.

నిత్య జీవితముననే సాధకుడు ప్రయోజనాత్మకముగా జీవించుట అభ్యసించవలెను. స్వధర్మమును భక్తి శ్రద్ధలతో నిర్వర్తించుట వలనను, ఇతరులతో సహకరించుట, కలసి పనిచేయుటవలనను, ఆయా సమయ సందర్భములలో నేర్పరితనముతో ప్రవర్తించుట వలనను, సంభాషణాదులలో సత్యముతో కూడిన ప్రియత్వము కలిగియుండుట వలనను, కరుణాత్మక దృష్టి ఉండుట వలనను, సాటివారితోను ఆవేశోద్రేకములు పడక, ప్రశాంతతతో పనులు చేయుట వలనను, ఇతరుల భావాభిప్రాయములను ఖండించకుండుట, (తోసిపుచ్చుట, కాదనుట, తప్పులు పట్టుట మొదలగునవి చేయకుండుట) వలనను సాధకుడు ప్రయోజకుడై వర్ధిల్లుచుండును.

– సి. హెచ్. సత్తిబాబు

దీపంతో పాటు వేడి, వెలుతురు ఎట్లా అయితే కలిసే ఉంటాయో, సద్గురుని సాన్నిధ్యంలో ప్రేమ, కరుణ, జ్ఞానం, శాంతి, అనుగ్రహం సమన్వితమై ఉంటాయి. సద్గురు (ప్రత్యక్ష, భౌతిక) సాన్నిధ్యంలోనే కాక వారు భౌతికదేహాన్ని విడిచిపెట్టిన తరువాత కూడా వారి సమాధిస్థానాలు భక్తులకు ప్రత్యక్ష సాన్నిధ్య అనుభూతిని అందిస్తే, ఆ సద్గురుమూర్తుల జీవిత చరిత్రలు వారి బోధనలను, దివ్య సన్నిధిని ప్రసాదిస్తాయి. -శ్రీబాబూజీ



ఆచారాల వెనుక నిద్రాణంగా ఉన్న ఆధ్యాత్మిక పరమైన అంశాలను, సూక్ష్మాలను మేల్కొలిపి, వెలికితీసి మనం ఆచరించి సాటివారికి తెలియచెప్పడం మన కనీస బాధ్యత - సిసలైన సదాచారపాలన.





మా జీవితాలన్నీ పూర్తిగా ముక్తికి,మోక్షానికి అంకితం. కానీ ఇతర అవసరాలు మమ్మల్ని ఇబ్బందిపెడుతున్నాయి" అని చెప్పి మిమ్మల్ని మీరు వంచించుకోవద్దు. ఇలా చెప్పుకోవద్దు. నిజంగా ముక్తికోసం కలత చెందేవారికి ఈ "ఇతర అవసరాలు ఉండవు. వారు రమణమహర్షిలా ఉంటారు. కానీ మనకు ఆయనకున్న స్వచ్ఛమైన స్వభావం, ఆయనంత స్థాయి లేవు. చాలా వ్యామోహాలు మనల్ని లాగుతున్నాయి. మనకు స్పష్టత, అవగాహన లేకపోవడం వలన మనం చాలా వైపులకు అలా లాగబడుతూ పెనుగులాటలో ఉంటాం. మన అవసరాలు మనల్ని అనేకరకాలుగా కొన్ని ఇటువైపు, కొన్ని అటువైపు లాగుతున్నందువల్ల ఈ అవసరాలు తీర్చుకోవడంలో మనకు వైరుధ్యం, సంఘర్షణ ఏర్పడుతుంది. కానీ మీరు స్పష్టత తెచ్చుకొని, ఆ అవసరాలను క్రమపద్ధతిలో పెట్టుకొని సామరస్యాన్ని సాధించగలిగితే అవి ఒకదానితో ఒకటి ఘర్షణ పడకుండా, పోటీ పడకుండా వుంటాయి. అలా అయినపుడు మీరు కనీసం మీ అవసరాలనైనా సామరస్యంతో అనుభవించగలుగుతారు.

మన మనసులో ప్రతి విషయం యొక్క స్థానం ఏమిటనే స్పష్టత వచ్చాక, మన జీవితంలో ప్రతి అణువునూ ఎటువంటి సంఘర్షణ, వైరుధ్యం లేకుండా మనం పరిపూర్ణంగా అనుభవించగలం.నేను, ఈ సంఘర్షణ నుండి మిమ్మల్ని మీరు విముక్తి చేసుకోండి అంటున్నాను. అయస్కాంతం, ఇనుపముక్క ఉదాహరణలో గల మూలసూత్రం వంటిదే ఇది– దీనిని మీకు అన్వయించుకోండి. ఇనుపముక్కకు, అయస్కాంతానికి గల తేడా ఏమిటి? రెండింటిలోను అణువుల సంఖ్య సరిసమానంగా ఉంటుంది. వాటిని వేరుచేసేదేమిటంటే – అయస్కాంత క్షేత్రంలో వున్న ప్రతి అణువు క్రమబద్ధంగా, ధృవీకృతమై, మిగతా అణువులతో సామరస్యాన్ని కలిగి ఉంటుంది. దాని అస్తవ్యస్తత నశిస్తుంది. అది అయస్కాంతంగా మారుతుంది. ఇనుపముక్కను అయస్కాంతంగా మార్చడానికి సులభమైన మార్గం దానిని మళ్లీ మళ్లీ అయస్కాంతంతో రుద్దడం, దానిని అయస్కాంత స్పర్శలో ఉంచడమే. క్రమంగా అయస్కాంత సాంగత్యం వల్ల ఇనుప అణువులు తమ అస్తవ్యస్తతను కోల్పోయి క్రమతను పొంది ధృవీకృత మవుతాయి. నెమ్మదిగా, అవి ఒకదానితో ఒకటి ఒద్దికను పొంది సమగ్రతను సాధించి వాటికవే అయస్కాంతంగా మారుతాయి. మన విషయంలో మనమంతా ఇనుపముక్కలం, బాబా మన అయస్కాంతం. బాబాను గుర్తుపెట్టుకోవడం, మన మనస్సును తిరిగి తిరిగి బాబా మీద లగ్నం



బాబా నిత్య సత్యం. ఆ నిత్య సత్యాన్ని అంటిపెట్టుకోవడం వారి (మన) నిత్యకృత్యం (కావాలి). - గురుకృప



కలిగే ఆనందం. మన ఆనందానికి గనుక స్పష్టత లేకపోతే, నిజంగా దానిని మనం ఆనందమని కూడా అనుభూతి చెందలేం. స్పష్టత, ఆనందం అనేవి కలసిఉంటాయి. అందుకే ఈ మార్గం స్పష్టతతో కూడిన ఆనందమైన మార్గం. దీనికి మీరు ఇంకా ఏమైనా పేర్లు కలిపి పెట్టుకున్నా ఇబ్బందేం లేదు, అవేమంత ముఖ్యం కాదు.

**భక్తుడు** : గురువుగారూ, ఈ స్పష్టత అనేది మనకు మనం సాధించుకునేదా? లేకపోతే మనకు ఎవరైనా ఇస్తే వచ్చేదా?

**గురువుగారు :** మీకు నిజంగా అవసరం ఉంటే, ఆ స్పష్టత వస్తుంది. ఆ స్పష్టతను పొందుతారు. మీరు ఆ స్పష్టతను సాధించుకుంటారు. నేను దానిని సాధించమనే చెప్తున్నాను. స్పష్టత ఎవరో ఇస్తారని నేను చెప్పడం లేదు, మీరు దానిని సంపాదించుకోవాలని చెప్తున్నాను. "ఊరికే అలా కూర్చోండి మీకు స్పష్టత వస్తుంది. నేను మీకా స్పష్టతనిస్తాను" అని నేను చెప్పను. అది మీకలా అనుభవం కావచ్చేమో కాని, అదేం ముఖ్యమైన విషయం కాదు. నేను చెప్పేది మాత్రం – మీ స్పష్టత మీరే సాధించాలి, సాధించండి!

**గురువుగారు :** చాలా మంది దేనినీ సరైన రీతిలో పూర్తిగా చేయలేరు. అలాంటి వారికి నేను, "నాకు ఇది నిజంగా ఎంతవరకు అవసరం? నిజంగా అవసరమా?" అనే స్పష్టత తెచ్చుకోమని చెబుతాను. ఆ స్పష్టత వచ్చాక, అంటే ఉదాహరణకు వాళ్లు, "నా తొలి ప్రాధాన్యత ప్రాపంచిక బాధ్యతలు, నా కుటుంబ బాధ్యతలు చూసుకోవడం–ఇది ఎనభైశాతం. మిగతా ఇరవైశాతం అవసరం ఆధ్యాత్మికపరమైనది. ఇది తప్పకుండా ఉందికానీ, కుటుంబపరమైన, వృత్తిపరమైన మిగతా అవసరాలు ఎక్కువగా ఉన్నాయి" అని చెప్పారనుకోండి. మీకు అటువంటి స్పష్టత ఉన్నప్పుడు, మీరు ఆధ్యాత్మిక విషయాలలో ఆ ఇరవై శాతాన్ని వినియోగించుకొని ఆనందానుభూతి పొందుతారు. ఈ ఇరవైశాతంతో పాటు ఇంకా మిగిలిన ఎనభై శాతాన్ని కూడా ఆనందంగా ఆస్వాదించగలరు. ఆ స్పష్టత గనుక మీకు లేనట్లయితే సంఘర్షణలో ఉంటూ, ఆ ఊగిసలాటలో జీవిస్తూ – ఇటు ప్రాపంచికంగానూ సరిగా ఉండలేరు, అటు పారమార్థికంగాను సరిగ్గా ఉండలేరు. అందుకనే నేను, మొదట మిమ్మల్ని స్పష్టత తెచ్చుకోమంటాను. మీరు ఇక్కడ ఎందుకోసం ఉన్నారు? "మేము ఆధ్యాత్మిక సాధకులం,



సత్యాన్ని తెలుసుకొని, సత్యానుభవం పొంది, ఆ సత్యానుభవాన్ని తోటివారికి ప్రసాదించే శక్తి ఒక్క సద్గురువుకు మాత్రమే ఉంటుంది. - గురుకృప






## చేస్తున్న పనే పూజ - జపం - స్మరణ - సత్సంగం - పారాయణ

అందరం ఇలా అనుకుంటాం. మనం ఒక వైపు ఎన్నో బాధ్యతలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక సాధనలు అభ్యసించడం ఎలా సాధ్యం అని. ఈ భావనలో ఉన్న మనం ఉదయం చేసే పూజ, పారాయణలను 'బాగా' చేసుకుంటున్నాం అనే భావాన్ని కలిగిస్తున్నాయి మనలో. ఎంతో బిజీగా వున్నా ఇవి చేస్తున్నాం కదా అన్న భావన మనది. సరే ఒక ఆలోచిద్దాం. ఒక సన్నివేశం గురించి.

ఒక శిష్యుడు గురువుగారిని ఇలా అడిగాడు. "గురువర్యా! జ్ఞానాన్ని సంపాదించక ముందు, సంపాదించిన తరువాత కూడా మీరు చేస్తున్న పని కట్టెలు కొట్టడం, బావిలో నీళ్ళు తోడడం... ఇలా మీరు చేసే పనులలో ఏమీ తేడా కనిపించడం లేదే!" అప్పుడా గురువు, "ఓ నేను చేసే పనుల్లో తేడా లేదు, కానీ నేను పనులు చేసే విధానంలోని నాణ్యతలో, నేర్పులో తేడా వచ్చింది" అన్నారు.

ఇప్పటి వరకూ మనం నిత్యమూ చేస్తున్న పనులలో మనకు ఎంత నేర్పు వచ్చింది అన్నది మనం ఎప్పుడైనా గమనించుకున్నామా? మనం ఒక పనిని నేర్చుకునేటప్పటికీ, నేర్చుకున్నాక, అభ్యసించాక ఆ పనిలోని అనుభవం వల్ల మనిషి ఆ పనిని సులువుగా చేయగలగాలి. మరపుకురాని విధంగా వుండాలి. ఉదా: పిల్లవాడు సైకిల్ తొక్కడం నేర్చుకునేటప్పుడు కష్టపడతాడు. అలానే ఈతకొట్టడం నేర్చుకునేటప్పుడు కష్టపడతాడు. కొన్ని రోజుల తరువాత వాడే ఎంత సులువుగా వాటిని చేస్తున్నాడు, కొన్ని నెలలు సైకిల్ తొక్కకపోయినా, ఈత కొట్టకపోయినా అంతే సులువుగా ఆ పనులు చేస్తుంటాడు మరలా చేసేటప్పుడు. ఇది అభ్యాసపు ఫలం. ఇలా ఉన్నాయా మనం నిత్యం చేసే పనులు? మనం నిత్యమూ చేసే పనులు అభ్యాసంగా చేయడం లేదు. కేవలం పనులుగా, బాధ్యతలుగా, కష్టంగా చేస్తున్నాం. కనుకనే అయ్యో ఇప్పుడు లేవాలా, వండాలా, చదవలా ఇలా ఆలోచనలు వస్తున్నాయి. చిన్నపిల్లల నుండి పెద్దవాళ్ళ వరకు! మరియు మనం చేసే పనులు శ్రద్ధగా, ప్రేమతో, సంబంధంతో చేయనంత కాలం ఇలానే వుంటుంది మన దృక్పథం. ఈ పనులను వదిలివేయగలమా? కనుక చేసే పనిని ఆనందంతో చేద్దాం. బాబా కోసం, మనం ప్రేమించే వారి కోసం, బాబా మనకిచ్చిన సంబంధాలలో "ఋణానుబంధాన్ని" విశ్వసించి చేద్దాం. ఇదంతా మనకు మహాత్ముల చరితలలో కనబడుతున్నది. కాని, దాన్ని మనం చదువుతున్నామేగాని, చూడటం లేదు. ఇదే గురువుగారు చెప్పే పారాయణ అన్న అంశంలో పరాయణత్వం గురించి...



"ఏ శక్తి (సద్గురువు) ఈ గ్రహాలను నియమిస్తుందో, నియంత్రిస్తుందో, నడిపిస్తుందో, ఆ సర్వసమర్థుని, సర్వవ్యాపకుని, సర్వజ్ఞుని విశాల శక్తి క్షేత్రంలో మనం ఉన్నాం" అన్నది గుర్తుంటే ద్వారకామాయి బిడ్డలను గ్రహాలేం చేయగలవు" అన్న బాబా అభయాన్ని అనుభూతి చెందగలం.



"బాబా లీలను చదివినప్పుడు, ఆ సందర్భంలో అక్కడున్న భక్తులలో ఒకడివై ఆ సన్నివేశాన్ని చూడగలగాలి. ఆ లీలా విలాసంలో మైమరిచి ఆనందిస్తూ మమేకమవగలగాలి. అలా పరాయణత్వం కలిగించినప్పుడే అది పారాయణ అవుతుంది" అని తరువాత ఆ స్థానంలో నేనుంటే ఎలా ఫీల్ అవుతాను. నా ఆలోచన ఎలా వుంటుంది. నా ప్రవర్తన ఎలా వుంటుంది. నా స్పందన (మాట) ఎలా వుంటుంది. ఇలా ప్రతి విషయాన్ని తరచి చూసుకుంటూ చదవాలి. ఇదీ చదవడం అంటే! అంతే తప్ప పుస్తకంలోని వాక్యాల వెంట కనులు కదలడం కాదు. అందుకే గురువుగారు చెప్పేది నీ మనసు ఎప్పుడు ప్రశాంతంగా వుంటుందో అప్పుడు చదవడం అని. మరి అసలు మన మనసు ఎప్పుడు ప్రశాంతంగా వుంటుంది? ఇవన్నీ గమనించుకోకుండా ఉదయాన్నే మనం వాటిని ఒక పనిలా చేస్తున్నాం. ఆ తరువాత మనం నిర్వర్తించవలసిన బాధ్యతలున్నాయి. అవి ఆపుకోలేం అందుకు ఇది త్వరగా ముగించాలి. ఆదరా బాదరగా... మనసంతా నిద్రపోతున్న భర్త, పిల్లాడిని లేపాలి, వారికి బెడ్‌కాఫీ ఇవ్వాలి, వాడిని రెడీ చేయాలి, టిఫిన్ చేయాలి, క్యారేజ్‌లు సిద్ధం చేయాలి. ఇవన్నీ సాగుతుంటే ఎక్కడ ప్రశాంతత? అయినా మనం పారాయణ చేసాం అన్న భావన మనది. దీన్లోంచి బయటకు రావాలి అంటే నాలుగు సూత్రాలు మనం పాటించాల్సిందే. Self Observation, Self Analysation, Self Examination, Self Correcting. ఇన్నీ ఇస్తేనే మనకు Self Life అదే Personal Life. ప్రతీ వారికి నాలుగు జీవితాలు... అవి Personal Life, Family Life, Professional Life, Social Life. ముందుంది Personal Life ఇది బాగావుంటే మిగతావి చక్కగా వుంటాయి, అక్కరకు వస్తాయి. కనుకనే నీ Self గురించి అంత ఆలోచించాలి, అలా సరిచేసుకోవాలి.

గృహస్థులుగా వున్న మనకు ఎలా సాధ్యం. అవంటే ఏ బాధ్యతలు లేని వారే (సన్యాసులు) ఆధ్యాత్మిక సాధనలు చేయగలరు అనుకుంటాం. మహాత్ములేమో... వారిది వసుధైక కుటుంబం అనుకుంటారు. కాని మనమేమో కష్టం వస్తే గురువుగారికి చెప్పుకుంటాం, తీర్చారు– అంటే తీర్చాల్సిన బాధ్యత ఆయనది కదా! ఆయన త్రికరణాలలో belongingness ఉంది. ఆ సంబంధాన్ని అంతగా గుర్తుంచుకున్నారు కనుకనే అంత ప్రేమ వారిలో! పని చేయించుకుంటున్నాం– కానీ అంత సంబంధాన్ని మనం గుర్తించడం లేదు, ఒక వేళ గుర్తించినా–గుర్తుంచుకోవడం లేదు. ఆ సంబంధమే మనల్ని మార్చేవి. మనలో మార్పు తీసుకువచ్చేది.



"కులాల కుళ్ళు, మతాల మళ్ళు - మానవతకే ముళ్ళు, ముక్తికి సంకెళ్ళు". మనిషిని మనిషిగా చూడనీయలేని కులమతాలెందుకు? కులమతాల ఆధారంగా విడిపోవడాన్నే కాదు, కలవడాన్ని నిరసించారు. దేనికి కూడా కులమతాలు ప్రాతిపదిక కారాదు. మతరహిత సమాజం కాదు, మతాతీత సమాజం రావాలి అంటారు శ్రీబాబూజీ.







గురించి ఆయన ఆలోచిస్తుంటారు. మనకు కష్టం వచ్చే ప్రశ్నే లేదిక. ఈ రకంగా నేను చెప్పిన ప్రకారంగా ఎవరైతే చేస్తారో వాళ్ళకు కష్టం, లోటు అనేటువంటిది ఉంది అనే ప్రశ్నే లేదసలు. అన్నీ ఇంక ఆయనే చూసుకుంటారు. ఆయనకు అన్నింటికంటే మనం అత్యంత ప్రీతిపాత్రులమవుతాం.

**– శ్రీబాబూజీ**

## లక్ష్యసిద్ధిని లభింపచేసే ముచ్చటైన మూడు సూత్రాలు – *ఆగష్టు 2012*



**గురువుగారు :** ఇటీవల కొంతమంది వచ్చి, "గురువుగారూ! మాకో సమస్య ఉంది. మమ్మల్ని ఎవరైనా 'గురువుగారిది ఏ రకమైన మార్గం? వారిది భక్తిమార్గమా" అని అడిగినపుడు మేము ఏమని చెప్పాలి?" అని అడిగారు. ఎందుకనంటే నేను భక్తి అనే పదం వాడను. ఇది జ్ఞానమార్గమా అంటే నేను జ్ఞానమనే పదాన్ని వాడను. ఇది కర్మయోగం అందామా అంటే నేను కర్మ అనే పదమూ వాడను. ఆ మాటకొస్తే నేనసలు యోగినే కాదు (గురువుగారు నవ్వుతూ..) అందువల్ల వాళ్ళు, "అసలు మేమనుసరిస్తున్న మార్గమేమిటని అందరూ అడుగుతున్నారు, మేము ఏమని చెప్పాలి?" అని అడిగారు. నేను, "గురువుగారిది స్పష్టతతో కూడిన ఆనందమైన మార్గం" అని చెప్పండి అన్నాను. ఇది ఒక మార్గం కాకపోయినప్పటికి సరదాకు అలా చెప్పమన్నాను. కారణమేమిటంటే అన్నింటికంటేముఖ్యమైనది – **స్పష్టత**. ప్రతి విషయంలోనూ స్పష్టత ఉండాలి. మనం అనుకునే ఆ నిర్వాణమో, ముక్తో, మోక్షమో లేదా బాబా సాక్షాత్కారమో – అదేదైనా గాని, – ఒకవేళ మనకు అది వస్తే కూడా దాని పట్ల నిస్సంశయంగా ఉండటానికి స్పష్టత అవసరం. ఉదాహరణకు, కొంతమంది నా దగ్గరకు వచ్చి, "గురువుగారూ! నన్ను నేను తెలుసుకున్నాను అనుకుంటున్నాను! నేను ఆత్మసాక్షాత్కారం పొందడం నిజమేనా? (గురువుగారు నవ్వుతూ) గురువుగారూ, నాకు ముక్తి అనుభవమైంది. నిజంగా నేను ముక్తుణ్ణా?" .. ఇలా అడుగుతుంటారు. వాళ్లకు దానిపట్ల కూడా సందేహముంది. అంటే వాళ్లకు స్పష్టత లేదన్నమాట. నిజానికి మనకసలు ఏ విషయంలోనూ స్పష్టత ఉండదు. కాబట్టి మనకు ముందుగా కావలసింది స్పష్టత. దాని వలన



సద్గ్రంథాలలో ప్రబోధింపబడిన ధర్మాన్ని అనుసరించక, మనో నైర్మల్యాలు తొలగడం దుర్లభం. - గురుకృప



ఇట్లా చేసుకుంటూ, చేసుకుంటూ, చేసుకుంటూ పోగా నిజంగా బాబాకు అందడం అనేటువంటిది మనకు అభ్యాసమవుతుంది. మనకు అభ్యాసమైందా లేదా అని చూసుకునేదానికి గీటురాయి ఇదే! ఏ పదార్థాన్ని తలచుకున్నా, ఏ పదార్థాన్ని గురించి విన్నా, ఏ పదార్థాన్ని చూసినా సరే ఒక రాయిని చూస్తే రాయి రుచిని ఊహిస్తామా మన మనసులో? ఈ లోపల అసలు దాని రుచి మీదకే పోకూడదు. ఆ ఆలోచనే రాకూడదు. అపుడు బాబా దగ్గరకి తీసుకెళ్లి నైవేద్యం పెడితే, ఆ తరువాత దాని రుచి మన మనసుకు రావాలి. పోగా పోగా ఎట్లా వస్తుందనంటే ఇది గానీ అభ్యాసం చేస్తూ చేస్తూ పోగా భగవంతుడికి నైవేద్యం పెట్టినటువంటి పదార్థాన్ని చూస్తేనే మనకు దాని రుచి జ్ఞాపకం వస్తుంది. కొంతకాలం పోయిన తరువాత రుచి జ్ఞాపకం వచ్చిందనంటే ఇది నైవేద్యం పెట్టిన పదార్థమే అని అనిపించాలి. ఇక రుచి జ్ఞాపకం రాగానే ఎంగిలి అయిపోయింది. ఇంక ఆయనకు నైవేద్యం పెట్టాల్సిన అవసరం లేదు. భౌతికంగా మనం రుచి చూడాల్సిన అవసరం లేదు. మానసికంగా రుచిని చూసేస్తున్నాం. మనం ప్రతి పదార్థాన్ని ఆ రకంగా ప్రతి పదార్థాన్ని ఎంగిలి చేసేస్తున్నాం. దాన్ని బాబాకు పెట్టడం ఎంతవరకు సముచితం? కాబట్టి ముందు అది కూడా పోవాలి. దాని యొక్క రుచిని మనసు ఊహించకుండా ఉండేటువంటిస్థితి మనకురావాలి. దీనికి ఇందాక నేను చెప్పినటువంటిది ఏది తిన్నా, ఏది చూసినా సరే ఇది బాబా యొక్క ప్రసాదం అని మనసులో అనుకోవడంతో మనం తిన్న ప్రతి ఒక్కటీ బాబా ప్రసాదమే అవుతుంది. బాబాకు రోజూ మనం భిక్ష పెట్టినటువంటి ఫలితం వస్తుంది. బాబా ప్రసాదం మనసులో పోయినందువల్ల మనలో ఉండేటువంటి ఆలోచనలన్నీ కూడానూ మంచి ఆలోచనలు, బాబాకు సంబంధించిన ఆలోచనలే వస్తాయి. ఎందుకని? మనకు ఆలోచనలు తెచ్చేటువంటిది, ఇచ్చేటువంటిది ఏమిటనంటే, ఆహారమే! ఆహారం సరిగ్గా ఉంటే ఆలోచనలు సరిగ్గా ఉంటాయి. కాబట్టి బాబా ప్రసాదమే తింటున్నట్లయితే పవిత్రమైనటువంటి ఆలోచనలు మనలో రావడం మొదలవుతాయి. బాబాకు సంబంధించిన ఆలోచనలే వస్తాయి మనలో ఉండేటువంటి బలహీనతలన్నీ కూడానూ మాసిపోతాయి. ఇట్లా మనం చేసేటటువంటి ప్రతి పనీ కూడానూ బాబా యొక్క సేవ క్రిందనే మనం మలచుకోవడంలో ఉంటుంది. అప్పుడు సాధనలోనే జీవితం భాగమవుతుంది. ఇంక మనం దేన్ని గురించి ఆలోచించాల్సిన పనుండదు. మనలను



తత్త్వం - ధర్మాన్ని ప్రబోధిస్తుంది.
మన(స్సు)ల్ని సాధనవైపు మరలుస్తుంది. - గురుకృప








ఇలాంటి అపోహలు తొలగాలంటే మహాత్ముల చరిత్రలు, సద్గ్రంథాలు చదవాల్సిందే! చదువుతూ, దర్శిస్తూ, అవగాహన చేసుకుంటూ, అనుభవిస్తూ, ఆనందిస్తూ (స్పందిస్తూ) చేయాలి. అది మనలో పరాయణత్వాన్ని కలిగిస్తుంది. అది మనకు నేర్పరితనాన్ని ఇస్తుంది. ఇక్కడ మనం నేర్చుకోవడం కాదు జరుగుతుంది. నేర్పరితనం, నైపుణ్యం, నాణ్యత, కౌశలం మనలో కలుగుతున్నాయి. ఆ చరిత్ర పూర్తయ్యేలోపు పూర్ణత్వం వైపు అడుగులు వేయడం తెలిసినవారమై, వివేక విచక్షణలు అనే సామర్థ్యపు మేలుకొలుపుతో శ్రద్ధ-సబూరి అనే ధర్మోత్సాహాలతో ఒక అడుగు వేయగలం... మన ఇంటి వాకిట నిలిచి వున్నాం. ఆ ఒక్క అడుగే మనల్ని మన ఇంటిలోకి చేర్చేది (ద్వారకామాయి) ప్రేమ ఉంటే ఇవన్నీ ఉంటాయి. ప్రేమలేకపోతే మిగిలినవన్నీ వుంటాయి. అరిషడ్వర్గాలు, సంకుచితాలు... ఇలాంటివన్నీ వుంటాయి. ప్రేమున్నచోట, వీటికి చోటుండదు. మన చేతిలోని సద్గ్రంథం మన చేతల్లోకి రావాలి. అదే గురువుగారు చెప్పేది. **"మన మాటల్లోకాదు. బాబాని వ్యక్తం చేయాల్సింది మన చేతల్లో"** అని. గీత మనలోకి వెళ్ళిందా? మనం గీతలోకి వెళ్ళామా? అని ప్రశ్నిస్తారు ఓ మహాత్ముడు.

చదవడం అంటే అలా చదవాలి. ఆ చదువు మనకు శక్తిని (దేహానికున్న బలాన్ని), సామర్థ్యాన్ని (మనసుకున్న బలాన్ని), సద్వినియోగపరచుకునే శౌర్యాన్ని (బుద్ధికున్న బలాన్ని) ఇస్తే మన గురువు మనలో ఉండి, మనతో చేయిస్తున్నారు ఇదంతా! అన్న గురుతే గురువుగా దర్శనమిస్తుంది. శారదాదేవి రోజంతా ఎన్నో పనులు చేస్తూ కూడా రోజుకి లక్ష జపం చేసేవారు. అదే మనమైతే పని చేస్తే జపం చేయం, జపం చేస్తే పనిచేయం. ఎవరన్నా ఒక్కరు ఎక్కువ అయితే భోజనానికి, చుట్టం ఎవరన్నా వస్తే వంట చేయాలంటే చాలా కష్టం. బయట నుండే అన్నీనూ, ఆ రోజు సత్సంగానికి వెళ్ళము. రోజూ చేసే నైమిత్తిక కర్మలు చేయము. ఇవన్నీ చూస్తున్న మన పిల్లలు చుట్టాలు రాగానే మేము స్కూలుకి పోము అంటున్నారు. ఇవి మన నిత్య సందర్శన జీవనం. ఎందుకంటే మనకు ఆరెండు వేరు వేరు. కాని శారదదేవి దృష్టిలో వ్యవహారిక ప్రాపంచిక జీవితానికి, పారమార్థిక జీవితానికి బేధం లేదు. "ఉన్నది ఒక్కటే జీవితం!" అంటారు శ్రీబాబూజీ.

శారదాదేవి వంట చేసినా, బట్టలు ఉతికినా, విస్తరాకులు కుట్టినా, చాపలు పరచినా, ఇల్లు ఊడ్చినా, ఇలా ఏ చిన్న పని చేసినా ఎంతో నిబద్ధతతో, నేర్పుతో, శ్రద్ధతో చేసేవారు. అలానే



గురుస్వరూపం స్మరణ మాత్రమున హృదయ దర్పణమున ప్రతి బింబితము కావలెను. అందులకై నిత్యమూ ధ్యానమవసరం. వారి స్వరూపం మన మనోపీఠముపై భాసిల్లుట మన యత్నముచే కాదు. వారి కృపాకటాక్ష ప్రభావమే , ప్రాభవమే. - గురుకృప



పూజను కూడా అంతే శ్రద్ధతో చేసేవారు. మనం పనిని ఎంత శ్రద్ధతో చేస్తున్నామో అంతే శ్రద్ధతో పూజ, జప, తపాలు చేయగలం. ప్రాపంచికంలో ఎలా వున్నారో అలానే పారమార్థికంలో వుంటారు. తేడా వుండదు. కాని ఇది మనం గమనించుకోము. అంతేకానీ పనిలో అశ్రద్ధ కనబరుస్తూ, జప ధ్యానాలు శ్రద్ధతో చేస్తున్నాం, చేయగలం అనుకోవడం పొరపాటు, అది ఒక భ్రమ. ఎందుకంటే పనినైనా, పూజనైనా చేసేందుకు ఉపకరణం మనస్సే కదా! మనం పని చేసే విధానం బట్టి (కర్మణ), మన మాట్లాడే తీరుని బట్టి (వాచా), మన ఆలోచనా సరళిని బట్టి (మనసా), మన మానసికస్థితి ఏమిటో తేటతెల్లమవుతుంది. పనులను సరిగా చేయడం–లేదంటే మనసు చంచలంగా ఉంది అని అర్థం. అందుకే గురువుగారు చెప్పేది – 'ఏ పని చేస్తున్నా మనసుపెట్టి చేయండి' అని.

వ్యక్తిగత పవిత్రతను పొందడం, కుటుంబ బాధ్యతలు సవ్యంగా నిర్వర్తించడం, సామాజిక స్పృహ కలిగివుండటం, వృత్తిగత జీవితాన్ని నేర్పుగా నిర్వహించడం అలవర్చుకున్నప్పుడే అది ఆధ్యాత్మికత. కారుకున్న నాలుగు చక్రాలు చక్కగా Balanceగా వుండి Steering మన చేతిలో ఉంటేనే Drive సరిగా చేయగలం. ఇదే ఆధ్యాత్మికత. ఇదే గురువుతో Constant touch వుండటం. మనకు ప్రత్యామ్నాయం లాంటిది ఆధ్యాత్మికత. గురువుని, దైవాన్ని అవసరం అయినప్పుడు ఉపయోగించు కోవాలనుకుంటాం. కష్టాలలో, సమస్యలలో గురువు గుర్తుకువస్తాడు. ఆధ్యాత్మికత మనకు ఎన్నటికీ ప్రత్యామ్నాయం కాకూడదు. నిత్య ప్రార్థన స్టీరింగ్ లాంటిది. కనుక జీవితం కార్ డ్రైవింగ్ లాంటిది అంటారు ఓ మహాత్ముడు. ఇలా మనం ఉన్నప్పుడు సుఖాలకు ఉపయోగించుకునే వాటి నుండి కూడా మనకు జీవనసత్యాలు, జీవించే సులువులను గ్రహించుకోగలం. అట్టి దృక్పథం అదే నేర్చుకోవాలనే దృక్పథం మనకుంటే అలా గురువు నిరంతరం, సతతం సర్వదా బోధిస్తూనే ఉన్నారు, నేర్పుతూనే వున్నారు. కనుక అట్టి దృక్పథాన్ని, అలా చూడగలిగే దృష్టిని మనం అలవరచుకోవాలి. అప్పుడే మనం ఆధ్యాత్మికతలో వున్నవాళ్ళం. గురుకులంలో వున్న వాళ్ళం, గురువుతో ఉన్నవాళ్ళం, ఆధ్యాత్మిక ప్రయాణం చేస్తున్న వాళ్ళం, జీవిస్తున్న వాళ్ళం, ఆనందిస్తున్న వాళ్ళం, ఆయనకు దగ్గర వారం, ఆయనకు తగ్గ బిడ్డలం – ఆయన వారం, ఆయనలోని వారం.

– గురుకృప



**ద్రవరూపంలో ఉన్న నీటికి, నేతికి, రంగులేదు. ఘన రూపంలోకి మారినపుడు వాటికి తెల్లని రంగు ఏర్పడుతుంది. అట్లే భక్తుని హృదయసీమలో ప్రేమ అధికమైతే అఖండాకార నిరాకార భగవంతుడు ఘనీభూతమై ఒక రూపునెత్తి గురువుగా ఆవిర్భవిస్తున్నది.**
**- గురుకృప**





ఎట్లా చూసుకున్నారు ఆమెను గాని, తాత్యాకోతేనుగానీ? ఎప్పుడో రెండు రొట్టెలు పెట్టినటువంటి దానికి ఆయన రోజూ ముప్పైఐదు రూపాయలు ఇచ్చారు– తరువాత రోజుల్లో. లక్షాధికారులూ, కోటీశ్వరులూ అయినారు ఎందుకని? బాబాకు ఒక ప్రిన్సిపుల్ ఉంది. "నాకెవరైనా సరే ఒక్కరూపాయి ఇస్తే నేను తిరిగి వాడికి పదిరూపాయలు ఇవ్వాలి" అని. ఆయన చేసిన ప్రతిజ్ఞ ఇదీ. ఇక మనం రోజూ భిక్షగానీ పెట్టినట్లయితే అంతకు పదింతలు మనకు దేనికీ లోటు ఉండకుండా ఆయన చూసుకుంటారు. ఈ నైవేద్యం సరిగ్గా పెట్టినట్లు ఎట్లా లెక్కంటే, మనం మామూలుగా ఆలయాల్లో చూస్తూ ఉంటాం... ముందు ఎవరో ఒక పూజారి తయారుచేస్తాడు అన్నం, ఆ బాలభోగమో లేకపోతే మహానైవేద్యమో ఏదో ఒకటి. దానికి పెద్ద మూత ఒకటి వేస్తారు. అది తీసుకొచ్చి విగ్రహం ముందు పెడతారు. కర్టెన్ ఒకటి వేస్తారు, నైవేద్యం పెట్టిన తరువాత తీస్తారు. అసలు ఏంటి ఈరోజు ప్రసాదం అనేటువంటిది అప్పటిదాకా సస్పెన్స్‌లో ఉంటుంది. ఎవరికీ అర్థం కాదు. ఎవరూ చూడకూడదు. ఎవరి దృష్టి దానిమీద పడకూడదు. అది అర్థరహితంగా పెట్టిన ఆచారం కాదు. ఎందుకనంటే శాస్త్రం ఏమి చెప్తుందంటే, మహాత్ములు ఏం చెప్పారంటే ... మనం ఒక పదార్థాన్ని చూసినపుడు ఆ పదార్థం యొక్క రుచిని మనం ఊహిస్తాం. చూడనక్కరలేదు విన్నా చాలు, ఊరగాయ అనే పేరు చెప్పామనుకోండి వెంటనే ఆ పచ్చడి యొక్క రుచిని మనసు ఊహించి నోట్లో నీళ్లూరతాయి, తలచుకుంటేనే. మనం నైవేద్యం పెట్టేది ఏమిటనంటే మనం రుచిని ఊహిస్తామే, రుచిని గురించి మనసులో ఊహ వస్తుందే, ఈ ఊహభాగమే భగవంతుడు తీసుకునేది. మనం ఏ పదార్థాన్ని చూసినా సరే, ముందు ఆ రుచిని ఊహించకుండా ఉండగలగాలి. అపుడే నైవేద్యం సరిగ్గా పెట్టడం వీలుపడతుంది మనకు. సాధనచేసి మనసు మీద అద్భుతమైనటువంటి అదుపు ఉండేటువంటి వాళ్ళకి ఆ భావం కలగదు కనుక వాళ్ళు మాత్రమే పెట్టి ఆ తరువాత ప్రసాదంగా అందరికి పంచడం అనేటువంటి ఆచారం మనకొచ్చింది ఆలయాల్లో.

మనం కూడా రోజూ, "ఇది బాబా ప్రసాదం, ఇది బాబా తినాలి మనం ముందుగానే రుచిని ఊహించకూడదు' అనే భావంతో మనం ప్రతి పదార్థాన్నిగానీ చూసినట్లయితే ముందు మన జిహ్వ మీద మనకు కంట్రోల్ వస్తుంది. రెండు... మనం పెట్టింది నిజంగా అప్పుడు బాబాకు అందుతుంది.



**గురుదేవుల ఆదర్శాలను, ఆశయాలను గౌరవించి అనుసరించే ప్రయత్నం - వారిపై చూపే ప్రేమకు నిజదర్పణం. - గురుకృప**



తింటే బాగుండును, అది తింటే బాగుండును అని. అందుకనే వేమన అన్నారు, "జిహ్వారుచుల చేత జీవుండు చెడునయా" అని. మనం మామూలుగా చాలా తేలిక అనుకుంటాం జిహ్వాను జయించడం. కానీ ఆలోచిస్తే మాత్రం అంత తేలికకాదది. ఏమి తింటున్నా సరే, మనం మంచినీళ్లు త్రాగుతున్నా, ఒక్కసారి ఇది బాబాకు నైవేద్యం పెడుతున్నాం ఆయన యొక్క ప్రసాదం ఇది. ఆయన యొక్క ఉచ్ఛిష్టం, ఆయన యొక్క నైవేద్యం అనుకొని తినడంతో మనం తినే ప్రతి ఒక్కటి కూడానూ ఆయన నైవేద్యం అవుతుంది.

మనం ఏమి తింటున్నా సరే అది ఆయనకు పెట్టడమే. అన్ని జీవుల్లోనూ ఉండి తినేటువంటిది ఆయనే అనుకోవడం, మంచినీళ్లు త్రాగుతున్నా సరే ఒక్కసారి మనసులో దానికి పెద్ద ఫోజు ఇవ్వాల్సిన అవసరం లేదు. మంచినీళ్లు అక్కడ గ్లాసులో పెట్టుకొని, ఒక్కసారి కళ్ళుమూసుకొని, నిటారుగా కూర్చొని ఏదో మంత్రం చదివి, అమృతమస్తు అమృతోపస్మరణమితి స్వాహా అనుకొని... దానికి ఇవన్నీ చెయ్యాల్సిన అవసరం లేదు. గ్లాసు చేతికి తీసుకుంటుండగానే మన మనసులో ఒక భావన వచ్చేస్తుంది. ఇది బాబా తీర్థం, ఇది బాబా యొక్క పాదతీర్థం అని గ్లాసు ఇక్కడి నుంచి నోటి కొచ్చేటప్పటికి ఈ భావన అయిపోతుంది. చూసేటటువంటి వాడికి ఏమీ అర్థం కాదు. మనం అసలు నైవేద్యం పెట్టామన్న విషయం కూడా అర్థం కాకూడదు. భోంచేస్తున్నాము నీళ్లు తీసుకుని ఇట్లా త్రిప్పి, ఇట్లా పోసి... ఈ తంతంతా చెయ్యాల్సిన అవసరమేమీ లేదు. తంతే మిగులుతుంది మనకు.

మనసులో ఆ భావం... ఇది బాబా ప్రసాదం, బాబా పెడితే నేను తినాలి. "అందరికీ అన్నీ ఇచ్చేవాణ్ణి నేనే!" అన్నారాయన, ఈరోజున ఈ రూపంలో నాకు అన్నం పెట్టారాయన. ఇది ఆయన ప్రసాదం. ఆయన యొక్క ఉచ్ఛిష్టం. ఆయన తినగా మిగిలినటువంటి ఉచ్ఛిష్టం" అనే భావంతో తింటాం. భావం ఎక్కడైతే ఉందో అక్కడ ఫలితమూ ఉంటుంది. రోజూ మన ఇంటికి బాబాను పిలిచి ఆయనకు సేవ చేసి, ఆయనకు భిక్ష పెట్టినటువంటి పుణ్యం మనకు వస్తుంది. ఆయనతో ఋణానుబంధం పెరుగుతుంది. రోజూ ఆయన మన ఇంటికి వచ్చి భిక్ష చేస్తుంటే మనకు ఎంత ఋణానుబంధం పెరుగుతుంది? బాయాజాబాయి ఇంటికి ఆయన రోజూ భిక్షకు వచ్చేవారు. ఆయన



గురువుకి సమర్పణ అయిన క్షణం నుండి బాహ్యజగత్తులోని ఏ వ్యక్తి, శక్తి, ఏ పరిస్థితి వారిని నిర్దేశించలేవు. ఇదే మన సమర్పణకు, అర్పణకు గురుతు - నిరూపణ. - గురుకృప





# ఓ మహిత ఆదర్శానికి మహా ఆరాధన

***జీవితమే ఆదర్శం:*** "చొక్కా చినుగులో పోయే పరువు ఒక పరువేనా?". చాలా సంవత్సరాల క్రితం ఓ సత్సంగంలో శ్రీబాబూజీ పరువు గురించి మాట్లాడుతూ అన్న మాటలవి. మన జీవితాలలో పరువు పేరుతో సాగే కట్టుబానిసత్వం అర్థమయితే తప్ప ఆ మాటలలోని అంతరార్థం మనకు బోధపడదు. వ్యక్తుల ఔన్నత్యం వారు సాధించిన గొప్ప విజయాలలోనో లేదా వారు అందుకున్న స్థాయిలోనో, వారి దృక్పథంలోనో ఉంటుంది. ఈ అంశాలే వారిని మహాత్ములను చేస్తాయి. వారి అడుగుజాడల్లో నడవాలనుకునే వారికి ఆదర్శాలవుతాయి. ఇందుకు పూజ్యగురుదేవులు శ్రీబాబూజీ జీవితమే తార్కాణం.

శ్రీసాయిపట్ల అనన్యమైన ప్రేమ, అచంచల విశ్వాసం, బాబా కోసం సర్వస్వాన్ని పణంగా పెట్టేసే సంసిద్ధత శ్రీబాబూజీ జీవితంలో కొట్టొచ్చినట్లు కనిపించే అంశం. ఆ అద్వితీయమైన సాయిభక్తి శ్రీబాబూజీ జీవితంలోని ప్రతి పార్శ్వంలో వ్యక్తమయింది. ఆ అంశాలే ఈనాడు సాయిపథానికి ఆదర్శాలయ్యాయి. అది అపరిగ్రహ నియమమైనా, వేదికలపై ఉపన్యసించకపోవడమైనా, ఛాందసాల ధిక్కారమైనా, విరాళాలు నిరాకరించినా, తమ పేరు మీద ఆశ్రమాల ఏర్పాటును తృణీకరించినా, చేరే లక్ష్యం కన్నా చేరుకునే మార్గం ముఖ్యమని ఉద్బోధించినా, తాము ఎవరికీ గురువును కాదని స్పష్టీకరించినా, ఇలా శ్రీబాబూజీ జీవితంలో (మనం ఆదర్శంగా భావించే) ప్రతి విషయం వెనుక సాయి మీద ఆధారపడి జీవించడమనే సద్గురు ప్రేమ సూత్రం దాగివుంది. అందుకే ఈనాడు ఎందరికో వారి జీవితమే ఒక ఆదర్శమయింది.

తాము సద్గురువులమని, తమ చెంతకు చేరిన వారు తమ శిష్యులనే భావన ఆయనకు ఎప్పుడూ లేదు. తాము కేవలం సాధారణ సాయి భక్తులమని చెప్పేవారు. ఇది వారు కేవలం వినమ్రత కోసం చెప్పిన మాట కాదు. వారి జీవితంలో ప్రతిక్షణం కనిపించిన సత్యం. సాయిభక్తుల దృష్టిలో ఆయన "సద్గురు" శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ అయినప్పటికీ ఆయన మాత్రం "సద్గురు శ్రీ సాయినాథుని" శరత్‌బాబుగానే ఉండిపోయారు. తాము బాబాకు చెందిన వారమనే గుర్తింపులో చివరికంటా నిలిచిపోయారు. సంస్థలకన్నా వ్యక్తులు, వ్యక్తుల కన్నా ఆదర్శాలు ముఖ్యమనేవారు. సాయిపథానికి



కార్యాలను ఉద్దేశించి ఆకారాలున్నా స్వరూపం ఒకటే, స్వభావం ఒకటే. క్రీస్తు అయినా, కృష్ణుడు అయినా, రామ్ అయినా, రహీమ్ అయినా, బాబా అయినా, బాబూజీ అయినా పథమెప్పుడూ (గురుపథం) ఒక్కటే. ఆ పథము చూపెడి ఈ పాదమెప్పుడూ (గురుపరంపర) ఒక్కటే. - గురుకృప



వ్యక్తులు కాక ఆదర్శాలు మార్గదర్శకత్వం వహించాలని అభిలషించారు. ఈ విషయంలో వారు తమకు కూడా మినహాయింపు ఇచ్చేవారు కాదు. వ్యక్తిపూజ పరాకాష్టకు చేరుకున్న సమకాలీన సమాజంలో ఆదర్శాలకు ఇంతటి విలువనిచ్చే ఆధ్యాత్మిక పథం కేవలం సాయిపథం అంటే అతిశయోక్తి కాదు.

**ఆదర్శాల వెనుక ప్రేమ, ప్రేమైక ఆదర్శాలు :** నిత్యజీవితంలోని చాలా సందర్భాలలో ప్రేమ, ఆదర్శం పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి. ప్రేమకోసం, ప్రేమించి వారి కోసం ఆదర్శాలు ప్రక్కన పెట్టేవారు కొందరు, ఆదర్శాల పేరు మీద ఆర్ద్రత లేని జీవితాలు గడిపేవారు మరికొందరు. కానీ సాయిపథాన ఆదర్శాలు, భావోద్వేగాలు ఏకతాటిపై సాగుతాయి. ప్రతి ఆదర్శం వెనుక సాయిప్రేమ అనే భావోద్వేగం ఉంది. సాయిప్రేమ అనుభవంలో ప్రతి ఆదర్శం అప్రయత్నంగా ఆచరణలోనికి వస్తుంది. ఉదాహరణకు, సాయిని తప్ప మరే ఇతర దైవాన్ని గురించి ఆలోచించడం సాధ్యం కాని ప్రేమ తత్పరతలో నుండి ఒకే దైవం. ఒకే ధ్యానం, ఒకే ధ్యేయం అనే సూత్రం రూపుదిద్దుకుంది. అంతేగానీ దానివెనుక తాత్విక, శాస్త్రీయ అంశాలలో ఎవరినో ఒప్పించాలనో, నొప్పించాలనో ఉద్దేశ్యం సాయిపథానికి లేదు. మన మంచి చెడ్డలకు బాబాదే బాధ్యత అనే అవగాహనలో నుండి– వాస్తు, జ్యోతిష్యాలను, మూఢాచారలను పట్టించుకోకపోవడమే ఆదర్శం వచ్చింది. అంతటా అన్నింటా అందరిలో తామున్నామని నిరూపించి నిదర్శనాలిచ్చిన సాయి జీవితాచరణలో నుండి కుల, మత, వర్గ, వర్ణ విచక్షణకు అతీతంగా మనిషిని మనిషిగా గౌరవించే ఆదర్శం ముందుకు వచ్చింది. బాబా దగ్గర తప్ప ఎవ్వరి దగ్గరా, దేనికోసమూ చేయి చాపకూడదనే పంతమే అపరిగ్రహం. ఆదర్శాల్ని అంటిపెట్టుకోవాలనుకునే ప్రతి ప్రయత్నంలో సాయికి చెందిన వారమనే గుర్తు ఉంది. ఆయన బిడ్డలుగా ఉండాలనే గుర్తింపు ఉంది. ఈ గుర్తులో, గుర్తింపులో ఆదర్శం సహజాతి సహజంగా ఆచరణలోనికి వస్తుంది. "సాయిఊసే, సాయిధ్యాసే లేదు లేదిక వేరేబాట" అని శ్రీబాబూజీ మనకందించిన ఆనంద సూత్రంలోని కీలకం ఇది.

***ప్రేమే సాధన, సాధించాల్సింది ప్రేమే:*** అత్యంత నిగూఢమైన సాధనా విషయాలను సైతం ప్రేమకు వ్యక్తీకరణలుగా చూస్తారు. శ్రీబాబూజీ, అందుకే సాధన గురించి, సాధనాపద్ధతుల గురించి ఎక్కువగా



**నన్ను నీవు చూచుచున్నావే, ఇదియే మాయ. ఎల్లలు లేని వాడు (అపరిమితుడు) నీ కనులకు కట్టునట్టు రూపమును దాల్చుటయే మాయ. నా మాయ చేతనే నిన్ను అనుగ్రహించుటకై ఈ రూపుదాల్చితిని. - శ్రీకృష్ణుడు**





మస్తిష్కం మొద్దుబారిపోయింది. మనసు మాటలు వెదుక్కుంటోంది. వేమన చెబుతాడు కదా! "జిహ్వారుచుల చేత జీవుండు చెడునయా!" అని. స్వామి ప్రసాదం కాకపోతే మరేదీ స్వీకరించదట ఆ శునకరాజం. మత సాంప్రదాయాలను అనుసరించి పవిత్ర పదార్థాలకు దూరమట. విశ్వాసానికి మారుపేరైన ఆ జీవరాజం. స్వామి దర్శనం కాకపోతే ఆనాటికి పస్తేనట. సద్గురురాయా! ఆ జీవి సంస్కారంలో నాకూ అణువంత ప్రసాదించండి. మీ చరణాలు చేరిపోతాను. "మాతృగర్భమున పుట్టి – మమతలనే చెరబట్టి మనిషిలాగా ముసుగెట్టి – మానవతనే పాతిపెట్టి, మంగళరూపుని నిన్ను మరుపులోకి నెట్టానయా". గురుదేవా! మీరే మంగళరూపులన్న సత్యం మా మదిన నిలిచేటట్లు చేయండి. మంగళకరమైన గురుస్వరూపాన్ని దర్శించుకోకుండా కడుపు నింపుకునే ఆసక్తి కూడా లేని ఆ జీవి సంస్కారానికి శతసహస్ర నమస్సులు. ప్రభూ! మనుషులన్న ముసుగు వేసేసుకున్నాం. మా మనసంతా 'పోగేసుకోవడం' పైనే. మరో క్షణంలోనే మరణిస్తామన్న ఆలోచన లేదు. డప్పులపై డబ్బెట్టి మీ రూపం నుండి తప్పించుకు తిరగాలన్నదే మా ప్రయత్నం. ఎండిపోయి, చిక్కి శల్యమయి పోయిన మా వివేకాలకు మీ అనుగ్రహవీక్షణాలే కొత్త చిగుర్లు పూయించగలవు. **గురుదేవా! గుండెలోతుల నుండి వేడుకుంటున్నాం. నిత్య మంగళస్వరూపులైన మీ రూపం మా మనస్సంతా నిండాలి! మహిమాన్వితమైన మీ అడుగుజాడల దీపకాంతులలో మా అడుగులు సాగాలి. ఆద్యంతాలు లేని మీ చరణాలను చేరాలి. అన్యథా శరణం నాస్తి! త్వమేవ శరణం మమ! "నీవే మము కాపాడు ఏలిక – లేదు నీ కరుణకు పోలిక!** (సశేషం)

**– గురుకృప**

## నైవేద్యం

ఇది బాబా ప్రధానంగా గుర్తు పెట్టుకోమని చెప్పినటువంటి ఒక విషయం. ఆయన ఏమన్నారంటే, "ఎవరైతే నాకు పెట్టకుండా ఏమీ తినరో, వాళ్ళకు నేను బానిసను, వాళ్ళను రక్షించడానికి నా తలనైనా ఇస్తా" అని అన్నారు. దాన్ని మాత్రం ఆయన చాలా ఎక్కువ స్ట్రెస్ చేసి మరీ చెప్పేవారు. ఆ నైవేద్యమనేటువంటి దాన్ని గురించి. ఎందుకని? మనలో ఆలోచనల్లో ఎక్కువ వీక్‌నెస్‌గా ఉండేటువంటి మనసుకు బలహీనత ఏమిటనంటే తిండి గురించే ఎందుకని? మనలను నిలబెట్టేటువంటిది ఆహారం కనుక, ఆహారానికి సంబంధించినటువంటి ఆలోచనలు మనకు ఎక్కువ వస్తూ ఉంటాయి. ఇది




**స్థిరత్వం (నిశ్చలతత్త్వం) - నిర్మలత్వానికి దోహదం. అడుగు కనిపించేంత స్థిరత్వం (నిశ్చలత్వం) పొందితే అడుగున పేరుకున్న మాలిన్యం సులభంగా తొలగించుకోగలం.**



భూతం లాంటి రూపం కాదు. ఆకృతి ధరించిన మానవాకారం. గట్టిగా కళ్ళు మూసుకుని తెరచి చూసాను. నిజమేనా లేదా నా భ్రాంతి మాత్రమా? అని. వారి కరుణ, ప్రేమలను వర్షించడానికి వేంచేసిన రూపం–చక్కటి కాంతి రూపంగా–కాషాయాంబరాలు ధరించిన ఆ దివ్యరూపం నాకు ఇలా సందేశం ఇచ్చింది. "క్రమశిక్షణతో మెలగు. నీ వాంఛితాలు నెరవేరుతాయి" మెల్లగా ఆ మానవాకృతి కనుమరుగయ్యింది. నా మది గొప్ప ప్రశాంతతతోనూ, ఆనందంతోనూ నిండిపోయింది. ప్రయత్నించినా, ఇక నాకు నిద్రపట్టలేదు. పెక్కు భారతీయులచే నడయాడే దైవంగా కొలువబడే స్వామి నాకిచ్చిన ఈ దర్శనం మరువలేని మధురానుభూతి. ఎదురయ్యే పరిస్థితులకు లొంగడమూ, క్రుంగడమూ మానవునిస్థితి. స్వప్న, సుషుప్త, జాగ్రదావస్థలకు ఆవల మానవరూపం ధరించేను సద్గురు ఆకృతి. సద్గురుచంద్రులు స్వప్నంలోనూ దర్శనమివ్వగలరు–సత్యంలోనూ మనతో(డు) నిలువగలరు. బ్రంటన్ భావాలు, అనుభవాలు, అనుభూతుల దర్శనం మనకు సద్గురుదర్శనాన్ని, సద్గురుపథాన్ని గుర్తు చేసింది కదూ!

గురుచంద్రుని ఆశ్రయించుకొని ఉండాలంటే మానవులే అయిఉండాలా? 'రూపాతీతులకు'– జీవుల స్వరూపాలతో ఏం పని? సకల జీవ ఉద్ధరణకే కాదు వారు దిగి వచ్చింది అవని. శ్రీమఠం క్యాంపు ఎక్కడ ఉన్నా 1927వ సం॥ నుండి ఒక కుక్క మఠ పరివారాన్ని అనుసరించి వచ్చేది. ఆ శునకరాజం యొక్క సంస్కారమేమోగాని, ఎన్నడూ పవిత్ర పదార్థాలు, వస్తువుల చెంతకు మాత్రం అడుగుపెట్టేది కాదు. మఠ సామగ్రికి, మఠ పశుసంపదకు ఎప్పుడూ తాను కాపలాగా ఉంటుండేది. మఠ ప్రసాదం వినా, ఇతరులిచ్చేది ఏదీ సేవించేది కాదు. పరమాచార్యులు పల్లకీలో ప్రయాణిస్తుంటే ఆ పల్లకీ క్రిందనే ఇతరులకు (బోయలకు) ఇబ్బంది కలుగకుండా అడుగులు వేస్తూ సాగేది.

స్వామి జనసందోహం మధ్య ఉంటే దూరంగా వెళ్ళి నిలుచుండేది. మఠ ఏనుగు కాళ్ళమధ్యనుండి స్పర్ధ లేకుండా స్వతంత్రంగా పచార్లు చేస్తుండేది. మఠ కాపలాదారులు విశ్రమిస్తే తాను ఆ బాధ్యత స్వీకరించేది. తనకు ఆహారం అందచేసే వారు మరచిపోతే పస్తులుండేది కానీ ఎక్కడా తినేది కాదు. ఎలాగో ఒకరోజు స్వామికి దూరమయ్యి మరలా వెంటనే పరుగుపెడుతూ స్వామిని చేరింది. ఆనాటి నుండి స్వామి దర్శనం చేసుకోకుండా ఆహారం ముట్టేది కాదు.



**నిజమైన గురు సందర్శనం జరిగిన (రోజు) క్షణం నుండి వారి జీవితపగ్గాలు గురువు చేతిలోకి వెళ్ళిపోతాయి. అప్పటి నుండి వారి జీవితం (నం) గురుదేవుల నిర్దేశానుసారమే సాగుతుంది. అది మన ఆధ్యాత్మిక జన్మదినం.**

**- గురుకృప**







ప్రస్తావించేవారు కాదు. ప్రేమను వ్యక్తం చేయడం ద్వారా ప్రేమను పెంచుకోమని చెప్పేవారు. ప్రేమ పెరిగితే అన్నీ వాటికై అవే సాధ్యమవుతాయనే వారు. ఓ సత్సంగంలో బాబాకు అర్పించి తినడం అనే విషయం గురించి చెబుతూ "మనకు ఎంత ఇష్టమయిన పదార్థమయినా దానిని చూడగానే మనకు మనకిష్టమయిన వారు తింటే బావుంటుంది కదా! అని అనిపిస్తుంది. అలాగే మనకు బాబా అంటే అంత ఇష్టముంటే మనకు ఏ పదార్థాన్ని చూసినా ముందు బాబానే గుర్తుకువస్తారు" అని చెప్పారు. ఈ అవగాహనలో నుండి చూస్తే తప్ప, నాకు అర్పించుకుండా ఎవ్వరైతే తినరో వారికి నేను బానిసను అన్న బాబా మాటను అర్థంచేసుకోవడం కష్టం. తమను గుర్తు చేసుకోకుండా మంచినీళ్ళు సైతం ముట్టని వారికోసం నేను ఏమైనా చేస్తానన్నారు బాబా.

బాబాను అంతగా ప్రేమించకపోతే ఈ విషయం అర్థం కాదు, ఈ విషయం అర్థం చేసుకోకుండా ఎన్నిసార్లు చదివినా, బాబా మాటలు బోధపడవు. మానవ స్వభావంలోని అన్ని సంక్లిష్టతలను అధిగమించడానికి ప్రేమ సాధనమని, మన హృదయాలలో ప్రేమ అనే చిరుదీపాన్ని వెలిగించిన సద్గురుప్రేమను పెంచుకునే ప్రయత్నం మనవైపు నుండే జరగాల్సి వుందని నిరంతరం గుర్తుచేసేవారు శ్రీబాబూజీ.

***ఈ ఆరాధన వేళ :*** కాలం నిరంతర ప్రవాహం, కాలగమనంలో పదాలకు ప్రాముఖ్యత పెరిగి ఆదర్శాల వెనుక అద్దాలు మరుగునపడిపోతాయి. అసలైన భావోద్వేగస్థానాన్ని యాంత్రికత ఆక్రమించింది. ఏదో తెలుసుకున్నామనే భ్రమలో అన్వేషణ ఆగిపోతుంది. ఆదర్శాలు మనల్ని మనకి చూపే అద్దాలుగా కాక సాటివారిని కొలతవేసే కొలబద్దలుగా మారిపోతాయి. సాటి సాయిభక్తులతో కలిసి సాగుతున్నా సాయిపథం ఎన్నటికీ ఒంటరి ప్రయాణమనే విషయం ఎప్పటికీ మరుపులోనికి జారకూడదు. ఎందరు చుట్టూ ఉన్నా మన సంబంధం, బాంధవ్యం మాత్రం బాబా గురుదేవులతోనే. ఎంత ప్రయత్నించినా సాయిభక్తిలో, సత్యాన్వేషణలో, ఆదర్శాల ఆచరణలో వారి స్థాయి అందుకోవడం ఎప్పటికీ సాధ్యం కాక పోవచ్చు. కానీ వారిచ్చిన స్ఫూర్తి వారి బిడ్డలుగా బ్రతకాలన్న ఆర్తి మనల్ని నిరంతరం ముందుకు నడిపించాలి. తమ జీవితాన్ని ఆదర్శంగా అందించిన ఆ మహితమూర్తికి అదే మనం చేసే నిజమైన ఆరాధన.

***– గురుకృప కోసం భీమ్***



**దైవాన్ని సంకరం చేయకు. నీకిష్టమైన దైవాన్ని ఆశ్రయించి, ఆరాధించి, అనుసరించి గమ్యం చేరుకో. పాయసంలో కారం వేసుకుంటామా? ఆవకాయలో చక్కెర వేసుకుంటామా? ఏక దైవాన్ని ఆరాధించి, అనుసరించి గమ్యాన్ని చేరుకో!**

**- గురుకృప.**



# గురుకృపాలహరి

మనిషికి గురువే మార్గదర్శి. మహాత్ములు, మహాత్ముల వాణి ఆ మార్గాన్ని చూపించే దీపస్థంభాలు. ఆ సత్యద్రష్టల బోధలే ఎత్తుపల్లాల్లో ఊతమిచ్చే చేతికర్రలు, జీవగర్రలు. గురువే తన కృపాదృష్టి చేత బిడ్డలను కాచుకుంటాడు. పిచ్చుక కాలికి దారంకట్టి లాక్కొన్నట్లు ఏ దారపు పోగుతో వారి 'ప్రేమ'బంధాన్ని తమ చెంతకు రప్పించుకోవాలో ఆ గురుచంద్రునికెరుక. వారి లీలా వినోదాలే అసాధ్యాలను సుసాధ్యాలను చేసే ధైర్యస్థైర్యాలు. వారితో చేసే మానసిక చెలిమే నిజమైన కలిమి, బలిమి. ఒక్కోసారి మనిషికి తెలియక తనవైపు నుండి గురుచంద్రుని పిలుపును కూడా నిరోధిస్తుంటాడు – కరుణాళువు కదా! గురువు మాత్రం విడిచిపెట్టడు. శ్రీసాయిచరిత్రలో దాదాసాహెబ్ చందోర్కర్, ఇదిగో మనం వింటున్న పాల్‌బ్రంటన్ మహాశయుడు ఈ కోవలోని వారే. పరమాచార్యులు బ్రంటన్‌ను భగవాన్ చెంతకు పంపడం అలాంటిదే! "పాశ్చాత్యుడనైన నాకు మహాత్ముని సన్నిధి లభిస్తుందా?" అన్న సంశయానికి స్వామి బ్రంటన్‌కు దారిచూపారు. మా గురుదేవులన్నట్లు "మౌలికమైన ఆధ్యాత్మిక సూత్రాలు ఎన్నటికీ మారవు" అని. పరమాచార్యుల–బ్రంటన్ సంభాషణను గమనిస్తే మా గురుదేవుల వారి మాటలకు ఒక చక్కటి రూపం వస్తుంది. చివరగా స్వామి చెప్పిన మాటలు బ్రంటన్‌తో "దక్షిణ దేశంలో ఉన్న 'మహర్షి' వద్దకు మీరు వెళ్ళవచ్చును. వారు అరుణాచలంలో ఉంటారు. మీరు దక్షిణం వదిలిపోయేదానికి ముందు వారిని తప్పక దర్శించండి. మీ అభీష్టం నెరవేరుతుంది. ఆదుర్దాపడనవసరం లేదు. మీరు దేనిని అన్వేషిస్తున్నారో దానిని పొందగలుగుతారు". గురువెప్పుడూ వ్యక్తిగతమే! గురుని పథమెప్పుడూ మనిషి హితమే. తన గురువైన రమణులను కలిసే క్రమంలో జగద్గురువుల సందర్శన, ఆశీర్వచనాలు కలగడం కేవలం గురుకృపావిశేషమే. స్వామితో బ్రంటన్‌కు జరిగిన సంభాషణను అవలోకనం చేసుకుంటే సద్గురుపథంలోని శోభ అవగతమవుతుంది.

స్వామి వారి చెంత సెలవు తీసుకునే క్రమంలో బ్రంటన్ భావాలు వారి మాటల్లోనే "నిగూఢమైన, మార్మికమైన వారి మాటలు, బాల్యం నుండి నేటి వరకు భగవంతునికే అంకితమైన వారి జీవితం, ప్రాపంచికం నుండి ఏనాడో విడివడి – భక్తులు సమర్పించినవి. మరల అవసరార్థులకు ఇచ్చేసి, సర్వోన్నత విరాగిగా విరాజిల్లుతున్న ఆ సాధుసత్తముని సన్నిధిని విడిచిపెట్టడం ఎంతో ఇబ్బందిగా



"మనిషి దైవంగా పెరగడం బాబా మతం". బ్రహ్మ సరస్వతిని నాలుకపై ఉంచుకున్నాడు. విష్ణువు లక్ష్మిని హృదయంలో ఉంచుకున్నాడు. శివుడు పార్వతిని సగభాగంలో ఉంచుకున్నాడు. అలా వారి దేహాలలో భాగం చేసుకున్నారు. అలా దాంపత్య లక్ష్యం - దంపతి అవ్వడమే అన్న ప్రబోధం ఉంది. అలానే ఆరాధన లక్ష్యం "నీవు - వారవ్వడమే".







ఉన్నా – సెలవు తీసుకోవలసి వచ్చింది". ఆనాటి రాత్రి చెంగల్పట్టులోని విశేష ప్రాంతాలు దర్శించి ఆనందించాను. నేను వెళ్ళే ముందు మరొక్కసారి స్వామివారిని దర్శించుకోవాలన్న కుతూహలంతో ఆ సన్నిధి చేరేసరికి పండిత, పామర, బుధజనుల మధ్య వారు పరివేష్టితులై ప్రసంగిస్తున్నారు. సభామండపంలో ఆశీనులైన వారి సమ్మోహనమైన రూపం నన్ను ఎంతగానో ఆకర్షించింది. ఆ భాష, భావం నాకు అవగతం కాకపోయినప్పటికీ, ప్రశాంత వదనాలతో, శాంతచిత్తాలతో, విశ్వాస హృదయాలతో ఆ మహాత్ముని సన్నిధిని అనుభవిస్తున్న వారందరిని చూసి నాకు కొంచెం అసూయ కలిగింది. వారి మనస్సులో దైవం పట్ల ఎటువంటి సందేహాలు లేవు. దైవం యొక్క ఉనికిపట్ల వారికి అత్యున్నత విశ్వాసం ఉంది. ఈ విశాల విశ్వంలో జరిగే సామాజిక, ఆర్థిక, యుద్ధపరిస్థితులకు వారికి ఎటువంటి సంబంధం లేదు. ఇది కదా సద్గురుసాన్నిధ్య మహిమ – 'కాలగతి'ని మరిపించే కరుణార్ద్రవ మధురిమ. "చెంగల్పట్టు నుండి చెన్నై కారులో బయలుదేరాము. నేను స్వామివారితో గడిపిన ఆ క్షణాల స్మృతులలో ఉండిపోయాను. చల్లని గాలి, కొబ్బరిచెట్ల వరుసలు, మౌనం... ఇంతలో నా స్నేహితుడు వెంకటరమణి నువ్వు చాలా అదృష్టవంతుడివి. ఒక ఐరోపా జాతీయునికి(రచయిత)కి స్వామివారితో వ్యక్తిగత సంభాషణ లభించడం ఇదే ప్రథమం అన్నాడు. నాకు చాలా గర్వంగా తోచింది. "రాత్రి పొద్దుపోయాక నా బసకు చేరుకునే సరికి చీకటిగా ఉన్న వరండాలో బ్యాటరీలైట్ వెలుగులో చూస్తే సుబ్రమణ్య నాకోసం వేచి చూస్తున్నాడు. నేను సుబ్రమణ్యను అడిగితే వారి గురువుగారి పేరు 'మహర్షి' అని తెలియచేసాడు. నేను నా ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నానని – 'మహర్షి'ని దర్శిస్తానని తెలపడంతో సుబ్రమణ్య సంతోషించాడు. అర్ధగంట గడిచాక నిద్రకు ఉపక్రమించాను".

"కొంతసేపు నిద్రించాను – ఉన్నట్లుండి మెలకువ రావడంతో లేచి కూర్చున్నాను. గది మొత్తం చీకటి ఆవరించి ఉంది. నా చేతి గడియారం చూసుకుంటే సమయం సుమారు మూడు గంటలు. నా శరీరం, నాడీ వ్యవస్థ ఎందుకో బిరుసుగా అనిపించాయి. నా చుట్టూ ఏదో విద్యుచ్ఛక్తి ప్రసారం జరుగుతున్నట్లుంది. నా మంచం చివర ఒక కాంతి దర్శనమివ్వడంతో లేచి కూర్చుని ఆ వంక చూసాను. కలవరమైన మదితో చూద్దును కదా! అక్కడ పరమాచార్యులు కనిపించారు. అదేదో



ఆటలాడే పిల్లవాన్ని తల్లి భోజనానికి పిలిస్తే ఆటలమీద ఆసక్తితో రాడు. ఊరుకోక తల్లి లాక్కొచ్చి కొట్టైనా తినిపిస్తుంది. అన్నం తింటే ఆకలి తీరేది తల్లికా? బిడ్డకా? అలాంటి వారే గురువు. పిల్లల కడుపు నిండాలనేప్పుడు తల్లిలాగ, నడక నేర్పేటపుడు తండ్రిలా ఉంటారు గురువు. పిల్లవాడికి ఆకలి తీరుతుంది. తల్లికేమో కడుపు నిండుతుంది. - గురుకృప

